మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 21-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 22 Issue: 22

Circulated to Telangana
Published from Jagitial

21 జూలై 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:55 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి అష్టమి తె. 5:17౦ వరకు తరువాత నవమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం చిత్తా రా. 8:47 వరకు తరువాత స్వాతి యోగం సిద్ధ సా. 6:21 వరకు కరణం విష్టి సా. 4:39 వరకు బవ తె. 5:17౦ వరకు వర్జ్యం రా. 2:56 నుండి తె. 4:41 వరకు దుర్ముహూర్తం ఉ. 8:30 నుండి ఉ. 9:22 వరకు రా. 11:16 నుండి రా. 12:00 వరకు రాహుకాలం మ. 3:35 నుండి సా. 5:12 వరకు యమగండం ఉ. 9:09 నుండి ఉ. 10:45 వరకు గుళికాకాలం మ. 12:22 నుండి మ. 1:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:19 నుండి తె. 5:07 వరకు అమృత ఘడియలు మ. 1:58 నుండి మ. 3:41 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

# బుల్లెట్.. ఆగింది!

## బహదూర్‌గూడ భూముల వివాదంలో రైతులకు రిలీఫ్

**తర్వాతి ఉత్తర్వుల వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దు.. రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ**

హైదరాబాద్, జూలై 20 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ భూముల వివాదంలో తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాల భూమిపై తర్వాతి ఉత్తర్వులు ఇచ్చే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ఆదేశాలతో పిటిషన్ దాఖలు చేసిన నలుగురు రైతులకు తాత్కాలికంగా ఊరట లభించింది. బహదూర్‌గూడలోని 28 ఎకరాల భూమిని గత 30 ఏళ్లుగా సాగు చేస్తున్నామని.. ఆ భూమి తమదేనని పేర్కొంటూ నలుగురు రైతులు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. బుల్లెట్



# రంగనాథ్.. చెప్తే అర్థమైతలేదా?

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటారా?.. వ్యవస్థలు పరిధి దాటితే ఊరుకోం**

**ఇలాగైతే కఠిన చర్యలు తప్పవు.. హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు సీరియస్**

హైదరాబాద్, జూలై 20 (ఈవార్తలు): హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఉల్లంఘిస్తూ కూల్చివేతలు చేపట్టడంపై న్యాయస్థానం తీవ్ర అసంతృప్తిని, అసహనాన్ని వ్యక్తం చేసింది. శాంతశ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ లిమిటెడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటీషన్‌ను లంచ్ మోషన్ రూపంలో విచారించిన హైకోర్టు, కమిషనర్ రంగనాథ్‌ను వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. దీంతో ఆయన కోర్టుకు వచ్చి స్వయంగా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. సదరు నిర్మాణ సంస్థకు సంబంధించిన ఆస్తి విషయంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు లోపలికి ప్రవేశించవద్దని తాము ముందే స్పష్టంగా చెప్పామని హైకోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. కోర్టు తరువాయి 2 వ పేజీలో...

# మీరంతే.. మేమింతే!

## హైకోర్టు హెచ్చరికలు.. హైడ్రా బుల్డోజర్లు

**కోర్టుల ఆదేశాలు బేఖాతరు.. వ్యవస్థలకు కోపాలు.. స్టేలు ఇచ్చినా వీడని అధికారుల పంతాలు**

**న్యాయస్థానాల ఉత్తర్వులపై ప్రజల్లో అనుమానాలు.. జ్యుడీషియరీ-ఎగ్జిక్యూటివ్ ఘర్షణేనా?**

ఏయ్.. అని కోర్టు బెదిరిస్తుంది;
హా.. అని అధికారులు అంటారు;
భయం లేదా? అని కోర్టు అంటుంది;
వణికిపోతున్నామని సర్కారు అంటుంది;
హద్దు దాటితే బాగోదని కోర్టు క్లాసిస్తది;
అడ్డే లేదని అధికారులు కానిచేస్తున్నారు;
అవును! తెలంగాణలో పరిస్థితి ఇలాగే ఉంది.
హైడ్రా వచ్చాక ఈ పరిస్థితి మరీ ఘోరం!

"హైడ్రా వ్యవహారం కేవలం అక్రమ నిర్మాణాల కూల్చివేతల వివాదం మాత్రమే కాదు. ఇది న్యాయస్థానాల ఆదేశాల అములు, కార్యనిర్వాహక వ్యవస్థ బాధ్యత, రాజ్యాంగ పరిమితుల మధ్య సమతుల్యతపై కీలకమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. వరుసగా హైకోర్టు వ్యక్తం చేస్తున్న అసంతృప్తి, ప్రభుత్వ యంత్రాంగం స్పందనపై ఉత్పన్నమైన సందేహాలు.. ఈ రెండూ కలిసి జ్యుడీషియరీ, ఎగ్జిక్యూటివ్ మధ్య అసౌకర్యకరమైన ఉద్రిక్తతను సూచిస్తున్నాయి"



(ఈవార్తలు-ప్రత్యేకం)

ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు మూడు స్తంభాలు. ఈ మూడు పరస్పర గౌరవం, రాజ్యాంగ పరిమితుల మధ్య పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. కానీ ఒక వ్యవస్థ మరో వ్యవస్థ అధికారాలను పట్టించుకోకపోతే, కోర్టు ఆదేశాలు అమలు కాకపోతే, న్యాయస్థానాల హెచ్చరికలు కూడా ప్రభావం చూపకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రమాదకర సంకేతాలు కనిపించడం ప్రారంభమవుతుంది. ఇటీవల హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు వ్యక్తం చేస్తున్న తీవ్ర అసంతృప్తి ఇదే ఆందోళనకు అద్దం పడుతోంది. గత కొంతకాలంగా హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై హైకోర్టు పలుమార్లు తరువాయి 2 వ పేజీలో...



హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర సచివాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అజారుద్దీన్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్లికేషన్ విధానాన్ని, బ్రోచర్‌ను మంత్రులు విడుదల చేశారు.

# ముగ్గు పోసుడే!

## 'క్యూర్'లో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

**అప్లికేషన్ విధానం, బ్రోచర్ విడుదల.. ఇది పేదోడి ప్రభుత్వం: పొంగులేటి**

హైదరాబాద్, జూలై 20 (ఈవార్తలు): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి విధివిధానాలు, దరఖాస్తు ప్రక్రియ, అర్హతలు, మార్గదర్శకాలు, తదితర వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో అల్పాదాయ వర్గాల(ఎల్ఐజీ) ప్రజలకు ఇళ్లను నిర్మించనున్నట్టుగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. "ఇందిరమ్మ ఇళ్ళ కేటాయింపులో కులం అడగం... మతం అడగం.. పార్టీ అడగం... మాకే ఓటు వేయాలనే కండిషన్ కూడా తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,329 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,934 |



# ఢిల్లీ రణరంగం

**పార్లమెంట్ ముట్టడికి సీజేపీ యత్నం**

**ఆందోళనకారులపై విరిగిన లాఠీ**

**జంతర్ మంతర్ పరిసరాలు దిగ్బంధం**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ వేదికగా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే ఊహించని రీతిలో రణరంగం నెలకొంది. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రశ్నాపత్రాల లీకేజీలు, సీబీఎస్ఈ మూల్యాంకనాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన చలో సంసద్ పార్లమెంట్ ముట్టడి తీవ్ర తరువాయి 2 వ పేజీలో...



# కోటిస్తేనే సరి

**నీట్ మృతులకు పరిహారం ఇవ్వాలి**

**ధర్మేంద్ ప్రధాన్ రాజీనామా చేయాలి**

**కేంద్ర మంత్రి నడ్డాకు సీజేపీ డిమాండ్లు**

న్యూఢిల్లీ: కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు భేటీ అయ్యారు. చర్చలకు కేంద్రం సానుకూలంగా ఉండడంతో ఇద్దరు ప్రతినిధులు నడ్డాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మంత్రి ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. తమ షరతులకు అంగీకరిస్తేనే ఉద్యమాన్ని నిలిపివేస్తామని వారు నడ్డాకు స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై జవాబుదారీతనం కోసం పోరాడుతున్న కాక్రోజ్ జనతా పార్టీ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో పప్పుధాన్యాలు (లెంటిల్స్) కీలక పాత్ర పోషిస్తాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు అధికంగా ఉన్నప్పటికీ, వీటి గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల భోజనం తర్వాత రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారిగా పెరగకుండా సహాయపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. పరిశోధకుల వివరాల ప్రకారం, పప్పుధాన్యాల్లో ఉండే కరిగే పీచు, రెసిస్టెంట్ స్టార్చ్, వృక్షాధారిత ప్రోటీన్లు జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. దీంతో గ్లూకోజ్ రక్తంలోకి క్రమంగా విడుదలై, చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా నియంత్రణలో ఉంటాయి. ఫలితంగా శరీరానికి రోజంతా స్థిరమైన శక్తి లభిస్తుంది.



# నలుగురు భారతీయులు మృతి

**ఉక్రెయిన్‌లో నౌకపై రష్యా దాడి.. మొత్తం 10 మంది దుర్మరణం**

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దాడిలో నలుగురు భారతీయులు మరణించారు. ఒడెసా పోర్టులోని నౌకపై రష్యా క్షిపణులతో విరుచకుపడింది. 10 మంది ప్రాణాలు కోల్పోగా వీరిలో నలుగురు భారతీయులే. మరో ఇండియన్ పరిస్థితి విషమంగా ఉందని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. నలుగురు భారతీయుల మృతికి కారణమైన రష్యా దాడిన ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఆదివారం ఎమ్‌వీ గోల్డెన్ తరువాయి 2 వ పేజీలో...

# మావాళ్లు చస్తే చీల్చి చెండాడుతా!

**ఇరాన్‌కు డోనాల్డ్ ట్రంప్ వార్నింగ్**



వాషింగ్టన్: జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసి ఇద్దరు అమెరికా సైనికులు మరణించిన ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ప్రతి అమెరికా సైనికుడి మరణానికి ఇరాన్ అనేక రెట్లు మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో ట్రంప్ స్పందిస్తూ, రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డేనియల్ కేన్‌తో పాటు సైనిక ఉన్నతాధికారులకు మరింత కఠినంగా ప్రతిస్పందించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తరువాయి 2 వ పేజీలో...



# ఎల్లుండి రణరంగమే!

**చిన్నాపెద్ద కలిసి రండి.. పీవోకేలో అందిన పిలుపు.. 23న భారీ నిరసనలు**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో కొనసాగుతున్న ఆందోళనలు మరింత ఉధృతమవుతున్నాయి. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ జూలై 23న ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఆ రోజు ఉద్యమ భవిష్యత్తుకు సంబంధించిన కీలక ప్రకటన చేస్తామని వెల్లడించింది. సోమవారం ఎక్స్ వేదికగా స్పందించిన జాక్, స్వచ్ఛంద బంద్, వీల్ జామ్ కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొంది. ప్రజలు ఐక్యత, సహనం, దృఢ సంకల్పంతో పోరాటాన్ని కొనసాగించాలని, తమ ప్రధాన డిమాండ్ల విషయంలో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

21.7.2026

**మేషం:** ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాలలో స్థిరమైన లాభాలు అందుకుంటారు. ఉద్యోగ విషయంలో అధికారులతో చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి కొంత వరకు అనుకూలిస్తుంది. నిరుద్యోగులకు కష్టానికి తగిన అవకాశాలు లభిస్తాయి.

**వృషభం:** వృధా ప్రయాణాలు చేస్తారు. ఇంటా బయటా ప్రతికూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి మిత్రులతో వివాదాలు కలుగుతాయి. ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగమున ఇతరులతో మాట పడవలసి వస్తుంది. నిరుద్యోగులకు మిశ్రమ ఫలితాలుంటాయి.

**మిధునం:** దూరప్రాంత బంధువులతో శుభకార్యములకు హాజరవుతారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన లాభాలు పొందుతారు. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగస్తులకు హోదాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది.

**కర్కాటకం:** కీలక వ్యవహారాల్లో ఆలోచించి ముందుకు సాగడం మంచిది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు తప్పవు. బంధు మిత్రులతో ఏర్పడిన వివాదాల పరిష్కారానికి ఆటంకాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. వాహన ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

**సింహం:** సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు నూతన బాధ్యతలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి సంతృప్తిగా ఉంటుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది.

**కన్య:** ఉద్యోగ విషయంలో అధికారుల నుండి సానుకూలత పెరుగుతుంది. ఋణాలు తీర్చడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. గృహ నిర్మాణ పనులు వేగవంతం చేస్తారు. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న అవసరానికి ధనం అందుతుంది.

**తుల:** ఆర్థిక వృద్ధి కలుగుతుంది. కీలక వ్యవహారాల్లో జీవితభాగస్వామి సలహా తీసుకోవడం మంచిది. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉండదు. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. దైవ కార్యక్రమాలపై ఆసక్తి కలుగుతుంది. నిరుద్యోగుల కష్టం వృధాగా మిగులుతుంది. నూతన ఋణాలు చెయ్యకపోవడం మంచిది.

**ధనస్సు:** చేపట్టిన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. సోదరులతో భూ సంబంధిత వివాదాలలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆకస్మిక ధన లాభం కలుగుతుంది. ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

**మకరం:** కీలక వ్యవహారాలలో విజయం సాదిస్తారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రశంసలు అందుకుంటారు. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది. వృత్తి ఉద్యోగాలలో అరుదైన అవకాశాలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

**కుంభం:** చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేస్తారు. వృధా ఖర్చులను అదుపు చేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండాలి. ఉద్యోగాలలో స్వల్ప ఇబ్బందులు తప్పవు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

**మీనం:** వృత్తి ఉద్యోగాలలో పనిభారం నుండి కొంత ఉపశమనం లభిస్తుంది. ఇంటా బయట అనుకూలత పెరుగుతుంది. సన్నిహితుల నుండి అరుదైన శుభాకార్య ఆహ్వానాలు అందుతాయి. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు లాభిస్తాయి.

# మీరంతే.. మేమింతే!

**మొదటి పేజీ తరువాయి**

తీవ్ర వ్యాఖ్యలు చేసింది. స్టే ఆదేశాలు ఉన్నా వాటిని పట్టించుకోకుండా కూల్చివేతలు ఎందుకు జరిగాయని ప్రశ్నించింది. కోర్టు ధిక్కరణ కేసుల్లో అధికారులను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. సమన్లు జారీ చేసింది. అవసరమైతే అరెస్టు వారెంట్లు జారీ చేయాల్సి వస్తుందని కూడా హెచ్చరించింది. రాజకీయ ఆదేశాల పేరుతో న్యాయస్థానాల ఆదేశాలను విస్మరించరాదని స్పష్టం చేసింది. అయినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదన్న భావన కోర్టు వ్యాఖ్యల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు కోర్టు ధిక్కరణ కేసుల్లో అఫిడవిట్ల సమర్పణ ఆలస్యం, అధికారుల గైర్హాజరు, ప్రభుత్వ తరపు వివరణల్లో జాప్యం వంటి అంశాలపై కూడా హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. న్యాయస్థానం నిర్దేశించిన గడువులను కూడా పాటించకపోవడం, కోర్టు అడిగిన సమాచారాన్ని సమయానికి ఇవ్వకపోవడం ప్రభుత్వ యంత్రాంగంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. న్యాయవ్యవస్థ ఇచ్చే ప్రతి ఆదేశం కేవలం ఒక కేసుకు మాత్రమే కాకుండా, మొత్తం పరిపాలనా వ్యవస్థకు మార్గదర్శకంగా ఉంటుందనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలి. కూల్చివేతలు ప్రజా ప్రయోజనం కోసం కావచ్చు. చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడడం ప్రభుత్వ బాధ్యతే. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం తప్పు కాదు. కానీ ఆ చర్యలు చట్టబద్ధంగా, న్యాయసమ్మతంగా, రాజ్యాంగ పరిమితుల్లోనే జరగాలి. ప్రతి వ్యక్తికి సహజ న్యాయ సూత్రాల ప్రకారం నోటీసు, వివరణ ఇచ్చే అవకాశం, కోర్టును ఆశ్రయించే హక్కు ఉన్నాయి. ఇవన్నీ పక్కనబెట్టి "ముందు కూల్చేయండి... తర్వాత చూద్దాం" అన్న ధోరణి చట్టపరమైన ఇబ్బందులను మాత్రమే కాదు, ప్రభుత్వ విశ్వసనీయతను కూడా దెబ్బతీస్తుంది. ప్రభుత్వానికి ప్రజల నుంచి వచ్చిన రాజకీయ అధికారం ఉంటుంది. న్యాయస్థానాలకు రాజ్యాంగం ఇచ్చిన న్యాయాధికారం ఉంటుంది. ఈ రెండింటి మధ్య పోటీ ఉండకూడదు; సమన్వయం ఉండాలి. కార్యనిర్వాహక వ్యవస్థకు పాలన చేసే హక్కు ఉన్నట్లే, ఆ పాలన రాజ్యాంగబద్ధంగా జరుగుతోందా లేదా అన్నది పరిశీలించే బాధ్యత న్యాయవ్యవస్థది. అందుకే కోర్టు ఆదేశాలను



అమలు చేయడం ప్రభుత్వానికి ఐచ్ఛికం కాదు; రాజ్యాంగబద్ధమైన విధి. ఇక్కడ మరో ముఖ్యమైన అంశాన్ని విస్మరించరాదు. అధికారులు రాజకీయ నాయకుల ఆదేశాలను అమలు చేస్తారు. కానీ చట్టవిరుద్ధమైన ఆదేశాలకు బాధ్యత కూడా చివరికి అధికారులపైనే పడుతుంది. కోర్టు ధిక్కరణ కేసుల్లో మంత్రి కాదు, రాజకీయ నాయకుడు కాదు, సంబంధిత అధికారి వ్యక్తిగతంగా హాజరుకావాల్సి వస్తుంది. జరిమానాలు, శిక్షలు కూడా వారిపైనే పడే అవకాశం ఉంటుంది. అందుకే రాజకీయ ఒత్తిళ్ల కంటే రాజ్యాంగ బాధ్యతలకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. న్యాయవ్యవస్థ కూడా తన రాజ్యాంగ పరిమితుల్లోనే పనిచేయాలి. పరిపాలనా నిర్ణయాల్లో అనవసర జోక్యం ఉండకూడదనే అభిప్రాయం తరచూ వ్యక్తమవుతుంది. అదే సమయంలో ప్రభుత్వం కూడా కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా ఉండే స్వేచ్ఛ తనకు ఉందని భావించకూడదు. ప్రజాస్వామ్యంలో "చెక్స్ అండ్ బ్యాలెన్సెస్" వ్యవస్థ సజావుగా నడవాలంటే పరస్పర గౌరవం అత్యంత అవసరం.

ఇప్పుడున్న పరిస్థితిని చూస్తే "నువ్వా.. నేనా?" అన్నట్లు జ్యుడీషియరీ, ఎగ్జిక్యూటివ్ మధ్య ఒక విధమైన ప్రతిష్ఠంభన నెలకొన్నట్లు కనిపిస్తోంది. ఇలాంటి వాతావరణం ఎక్కువకాలం కొనసాగితే నష్టపోయేది ఏ ఒక్క వ్యవస్థ కాదు. ప్రజల విశ్వాసమే దెబ్బతింటుంది. కోర్టు ఆదేశాలు అమలు కావని ప్రజలు భావిస్తే న్యాయవ్యవస్థపై నమ్మకం తగ్గుతుంది. మరోవైపు ప్రతి ప్రభుత్వ చర్య కోర్టు వివాదంగానే మారితే పరిపాలనా సామర్థ్యంపై సందేహాలు పెరుగుతాయి. ప్రజాస్వామ్యంలో ఎవ్వరూ సర్వాధికారులు కాదు. ప్రభుత్వం చట్టానికి లోబడి ఉండాలి. న్యాయస్థానాలు రాజ్యాంగానికి లోబడి ఉండాలి. అధికారులందరూ తమ రాజ్యాంగ ప్రమాణాన్ని గుర్తుంచుకోవాలి. రాజకీయ సంకల్పం ఎంత బలమైనదైనా, అది చట్టం కంటే గొప్పది కాదు. అలాగే న్యాయస్థానం ఇచ్చిన ఆదేశం కేవలం ఒక సూచన కాదు; అమలు చేయాల్సిన రాజ్యాంగ బాధ్యత. హైడ్రా వివాదం చివరకు ఒక కీలకమైన పాఠాన్ని గుర్తు చేస్తోంది. ప్రభుత్వాలు వస్తుంటాయి... పోతుంటాయి. అధికారులు మారుతుంటారు. కానీ రాజ్యాంగం శాశ్వతం. ఆ రాజ్యాంగాన్ని కాపాడే వ్యవస్థల మధ్య పోటీ కాదు, పరస్పర గౌరవం ఉండాలి. లేకపోతే "నువ్వా.. నేనా?" అనే ప్రశ్న చివరకు "ప్రజాస్వామ్యం గెలిచిందా? లేక అహంకారం గెలిచిందా?" అనే పెద్ద ప్రశ్నగా మారే ప్రమాదం ఉంది.

### హైడ్రా రంగనాథ్‌పై హైకోర్టు వ్యాఖ్యలు ఇలా..

- 30 సెప్టెంబర్ 2024 (అమీన్‌పూర్ కూల్చివేతలు )– స్టే ఆదేశాలు ఉన్నా కూల్చివేతలు చేస్తే అది కోర్టు ధిక్కరణేనని స్పష్టం చేసింది. అధికారులు రాజకీయ ఆదేశాల పేరుతో నిబంధనలు ఉల్లంఘించవద్దని హెచ్చరించింది.
- 31 డిసెంబర్ 2024 (ఎఫ్‌టీఎల్ భూముల కూల్చివేత)– "ఆధారాలేమిటి?", "పిటిషనర్ వద్ద పత్రాలు ఉన్నప్పుడు ఎలా కూల్చారు?" అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.
- 31 అక్టోబర్ / 1 నవంబర్ 2025 (మధ్యంతర ఉత్తర్వుల ఉల్లంఘన) – కోర్టు ధిక్కరణ కేసులో రంగనాథ్‌కు సమన్లు జారీ చేసింది. వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది.
- 27 నవంబర్ 2025 (కోర్టు ధిక్కరణ విచారణ) – "డిసెంబర్ 5లోపు హాజరుకాకపోతే అరెస్ట్ వారెంట్ జారీ చేస్తాం" అని హెచ్చరించింది. కోర్టు ధిక్కరణలకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించింది.
- 6 మే 2026 (విచారణ), (సూరారం భూమి బోర్డు తొలగించని కేసు) – హైడ్రా కమిషనర్ వరుసగా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్నారు అని వ్యాఖ్యానిస్తూ కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశించిన 48 గంటల్లో బోర్డు తొలగించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించింది.
- 9-10 జూన్ 2026 (కోర్టుకు హాజరుకాని అంశం) – రంగనాథ్ వ్యక్తిగతంగా హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. అఫిడవిట్ కూడా నిర్లక్ష్యంగా ఉందని వ్యాఖ్యానించింది. "కోర్టు ఆదేశాలను విస్మరించడం మీ కెరీర్‌పై ప్రభావం చూపుతుంది" అని హెచ్చరించింది.
- 24 మార్చి 2026 (బతుకమ్మకుంట కేసు) – 2025లో ఇచ్చిన యథాతథ స్థితి ఆదేశాలను ఉల్లంఘించి పనులు చేపట్టారని పేర్కొంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోర్టు ధిక్కరణ కేసులో దోషిగా తేల్చింది.

# ముగ్గు పోసుడే!

**మొదటి పేజీ తరువాయి**

పెట్టం... ఇది పేదోడి ప్రభుత్వం, ఇందుకే ఇది ఇందిరమ్మ ప్రభుత్వం " అని మంత్రి పొంగులేటి తెలిపారు. గత పాలకులు పనికి రాని ఆలోచన కారణంగా ఎన్నికల సమయం లో హైదరాబాద్‌కు 30-35 కిలోమీటర్ల దూరంగా ఇళ్ళను నిర్మించడం వలన కేవలం 8-9 వేల మంది మాత్రమే నివాసాల్లో దిగారని , మిగిలిన వారు మంజూరు పత్రాలు తీసుకున్నారే తప్ప వాటిలోకి వెళ్లలేదనే విషయం తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. ఈ పరిస్థితుల్లో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. పేదల నివాస ప్రాంతాల్లోనే 525 చదరపు అడుగుల వైశాల్యంతో సుమారు 40-60 లక్షల రూపాయిల విలువ కలిగిన స్థలాలను ఆడపడుచుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని తెలిపారు. దీనిని పదేళ్ల వరకు అమ్ముకునే అవకాశం ఉండదని, అయితే బ్యాంకులో రుణం కోసం తనఖా పెట్టుకోవచ్చునని తెలిపారు. ఇళ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ ఉంటుందన్నారు. తొలి విడతలో క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో.. ఒక్కో నియోజకవర్గానికి దాదాపు 500 ఇళ్ల చొప్పున ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలో మరో 8 నియోజకవర్గాలలో కూడా ఈ పథకం అమలు చేస్తామని చెప్పారు. పేదవాడి సొంతింటి కల నెరవేరేవరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం కొనసాగుతుందని, చివరి లబ్ధిదారునికి ఇల్లు అందేవరకు కొనసాగుతుందని , ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల రూపాయిలను ఉచితంగా ఇస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి 11 లక్షల రూపాయిల వరకు ఖర్చు అవుతున్నందున లబ్ధిదారుల నుంచి మిగిలిన ఆరు లక్షల రూపాయిలను నాలుగు వాయిదాల్లో తిరిగి తీసుకుంటామని... ఆ మొత్తంలో ఈ 10 వేల రూపాయిలను మినహాయిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జూలై 21 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పొంగులేటి తెలిపారు. మీ సేవ లేదా వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తు ఫీజు రూ. 100,. ఈఎండీ/టోకెన్ అడ్వాన్స్ రూ.10,000గా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. అయితే ఫ్లాట్లు రాని వారికి ఈఎండీ రూ.10 వేలు తిరిగి చెల్లించనున్నామని తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తారని, అర్హత బట్టి కేటాయింపు జరుగుతుందన్నారు. 360 డిగ్రీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వడపోత జరుగుతుందని, అప్పటికీ ఎక్కువ దరఖాస్తులు వస్తే అందరి ముందూ బహిరంగంగా లాటరీ తీసి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

అర్హతలు ఇవీ..

దరఖాస్తుదారులు గత 10 సంవత్సరాలుగా హైదరాబాద్ (క్యూర్) నివాసి అయి ఉండాలి. దరఖాస్తుదారు లేదా అతని కుటుంబం ఔటర్ రింగ్ రోడ్ లేదా క్యూర్ ఏరియాలో ఇల్లు లేదా ప్లాట్ కలిగి ఉండకూడదు. దరఖాస్తుదారు ఇంతకుముందు ప్రభుత్వం నుంచి గృహ ప్రయోజనాన్ని పొంది ఉండకూడదు.

# రంగనాథ్.. చెప్తే అర్థమైతలేదా?

**మొదటి పేజీ తరువాయి**

ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ, హైడ్రా సిబ్బంది అక్కడకు వెళ్లడమే కాకుండా, సదరు యాజమాన్యంపైనే తిరిగి కేసులు పెట్టడం ఏంటని న్యాయమూర్తి మండిపడ్డారు. 'మీకు కోర్టులపై నమ్మకం లేదా? బాధ్యతాయుతమైన పెద్ద అధికారులే ఇలా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎలా?' అంటూ న్యాయస్థానం నిలదీసింది. హైడ్రా పనితీరుపై కోర్టులో తరచూ కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలవుతుండటాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. అనుమతి లేకుండా ఒకరి ప్రైవేట్ ప్రాపర్టీలోకి హైడ్రా అధికారులు ఎలా ప్రవేశిస్తారని ప్రశ్నించింది. వ్యవస్థలు తమ పరిధిని దాటి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించింది. ఇలాంటి ధోరణి ముమ్మందు కూడా కొనసాగితే, చట్టాన్ని ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డీజీపీని నేరుగా ఆదేశించాల్సి వస్తుందని హైకోర్టు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

## బుల్లెట్.. ఆగింది!

**మొదటి పేజీ తరువాయి**

ట్రైన్ ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియలో తమ హక్కులకు భంగం కలుగుతోందని రైతులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్లు చూపిస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాలపై అధికారుల సంతకాలు లేవని.. వారు అక్కడ సాగు చేస్తున్నారనే కారణంతో భూమి తమదని చెప్పడం సరైన ఆధారం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం కేవలం ప్రభుత్వ భూములకే ఫెన్సింగ్ వేస్తోందని.. పిటిషనర్లు పేర్కొంటున్న భూములను తాము ఆక్రమించలేదని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. పిటిషనర్ల భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు చేపట్టరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని స్పష్టం చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు అవసరమైన భూముల కేటాయింపు అంశం ఇటీవల వివాదానికి దారితీసింది. సుమారు 650 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు కోసం గుర్తించగా.. అందులో తమ భూములు కూడా ఉన్నాయని రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అధికారులు ఫెన్సింగ్ పనులు చేపట్టే ప్రయత్నం చేయడంతో రైతులు నిరసనలు చేపట్టగా, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## నలుగురు భారతీయులు మృతి

**మొదటి పేజీ తరువాయి**

లియో అనే నౌక 17 మంది సిబ్బందితో ఒడెసా పోర్టు నుంచి బయల్దేరింది. ఈ నౌకపై రష్యా దాడి చేయడంతో పది మంది చని పోయారని విదేశాంగ శాఖ పేర్కొంది. రష్యా దాడిని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. వాణిజ్య పడవలను లక్ష్యంగా చేసుకోవడం, పౌరులను చంపడం సమంజసం కాదని.. అలాంటప్పుడు జల స్వేచ్ఛ రవాణా, వాణిజ్యంను నిలిపివేయాలని రష్యాను కోరింది. 'ఉక్రెయిన్‌లోని తాజా పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నాం. నౌకా దాడిలో ఆత్మీయులను కోల్పోయిన వారికి, గాయపడిన వారి కుటుంబాలకు సాధ్యమైనంత సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

## కోటిస్తేనే సరి

**మొదటి పేజీ తరువాయి**

పంతం వీడడం లేదు. సోమవారం ఛలో పార్లమెంట్‌ను పోలీసులు అడ్డుకుంటుండగానే.. ఆ పార్టీకి చెందిన ఇద్దరు కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డాను కలిశారు. మంత్రితో భేటీ సందర్భంగా తమ మూడు డిమాండ్లు ఆయన ముందుంచారు. ఒకటి.. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఎలాంటి ఆంక్షలు లేకుండా విడుదల చేయాలి. రెండోది.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. మూడోది.. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించాలి. ఈ మూడు డిమాండ్లను ఒక లేఖలో రాసి నడ్డాకు సీజేపీ నాయకులు మెమోరాండం సమర్పించారు.

# ఢిల్లీ రణరంగం

**మొదటి పేజీ తరువాయి**

ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన నిరసన ప్రదర్శన పార్లమెంట్ వైపు దూసుకురావడంతో ఢిల్లీ పోలీసులు వారిని అడ్డుకునేందుకు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిరసనకారులకు, భద్రతా దళాలకు మధ్య తీవ్ర తోపులాట జరగడంతో పరిస్థితి ఒక్కసారిగా అదుపు తప్పింది. జంతర్ మంతర్ చుట్టుపక్కల ప్రాంతాలను ఢిల్లీ పోలీసులు ఏకంగా ఒక ఇనుప కోటలా మార్చివేసినప్పటికీ, నిరసనకారులు బారికేడ్లను తోసుకుంటూ ముందుకు రావడానికి ప్రయత్నించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం రంగంలోకి దిగిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (, ఢిల్లీ పోలీసులు ఆందోళనకారులపై విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడంతో పాటు, గుంపును చెదరగొట్టడానికి పలు రౌండ్ల టియర్ గ్యాస్ గోళాలను ప్రయోగించారు. భద్రతా కారణ దృష్ట్యా పటేల్ చౌక్, రాజీవ్ చౌక్ వంటి కీలక మెట్రో స్టేషన్ల గేట్లను అధికారులు అత్యవసరంగా మూసివేశారు. ఈ లాఠీచార్జ్, యర్ గ్యాస్ ప్రయోగంలో పలువురు విద్యార్థి సంఘాల నేతలు, సీజేపీ కార్యకర్తలు గాయపడటంతో పరిసర ప్రాంతాలన్నీ తీవ్ర గందరగోళంగా మారాయి. మరోవైపు పార్లమెంట్ వెలుపల వీధిపోరాటాలు, రణరంగం కొనసాగుతున్న తరుణంలోనే పార్లమెంట్ భవనం లోపల కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విపక్షా లు, విద్యార్థి సంఘాలు పట్టుబడుతున్నందున.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్‌తో పార్లమెంట్ కాంప్లె క్స్‌లోని తమ కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమ య్యారు. దేశ రాజధానిలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితి, విద్యార్థుల ఆందోళనలు, విపక్షాల నిరసనలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ భేటీ అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేస్తారా లేక ప్రభుత్వం సీజేపీ డిమాండ్లపై చర్చలకు ముందుకు వస్తుందా అనే దానిపై సస్పెన్స్ నెలకొంది.

# మావాళ్లు చస్తే చీల్చి చెండాడుతా!

**మొదటి పేజీ తరువాయి**

తెలిపారు. "ఇరాన్ ప్రతిసారి ఒక అమెరికా సైనికుడిని చంపితే, దానికి అనేక రెట్లు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రక్షణ శాఖ మంత్రి, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్, సైనిక నాయకత్వానికి ఆదేశాలు ఇచ్చాం" అని ట్రంప్ పేర్కొన్నారు. శుక్రవారం జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేయగా ఇద్దరు అమెరికా సైనికులు మరణించగా, మరో సైనికుడు గల్లంతయ్యాడు. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరాన్ ప్రత్యక్ష దాడిలో అమెరికా సైనికులు మరణించడం ఇదే తొలిసారి అని అమెరికా అధికారులు తెలిపారు. దాడి సమయంలో అమెరికా, మిత్రదేశాల బలగాలు స్థావరాన్ని రక్షించే ప్రయత్నంలో ఉన్నాయని అమెరికా సైన్యం వెల్లడించింది. గాయపడిన మరో నలుగురు సైనికులను జోర్డాన్ ఆస్పత్రులకు తరలించగా, చికిత్స అనంతరం వారిని డిశ్చార్జ్ చేశారు. మరణించిన ఇద్దరు సైనికులను హవాయికి చెందిన 25 ఏళ్ల ఫస్ట్ లెఫ్టినెంట్ టైలర్ జేమ్స్ ఫీహాన్, టెక్సాస్‌కు చెందిన 19 ఏళ్ల ప్రైవేట్ ఇసబెల్లా గోంజాలెస్గా పెంటగాన్ గుర్తించింది. వీరు ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్)కు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన మిషన్‌లో భాగంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 17 మంది అమెరికా సైనికులు మరణించినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది.

## ఎల్లుండి రణరంగమే!

**మొదటి పేజీ తరువాయి**

ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేసింది. జాక్ నాయకుడు సర్దార్ ఉమర్ నజీర్ కశ్మీరీ మిర్‌పూర్, ముజఫరాబాద్, పూంచ్ ప్రాంతాల ప్రజలకు ప్రత్యేకంగా పిలుపునిస్తూ, జూలై 23న జరిగే నిరసనల్లో పూర్తి స్థాయిలో పాల్గొనాలని కోరారు. ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ, పోరాట విజయానికి ప్రార్థనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత వారం పాకిస్థాన్ ప్రభుత్వానికి తమ డిమాండ్ల అమలుకు చివరి అవకాశం ఇస్తూ, జూలై 21 వరకు ముజఫరాబాద్‌కు చేపట్టనున్న లాంగ్ మార్చ్‌ను తాత్కాలికంగా వాయిదా వేసింది.

# సర్తోనే ఓటర్‌గా గుర్తింపు

**చొప్పదండి నియోజకవర్గం లో 80% ప్రక్రియ పూర్తి**

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర, జూలై 20 (ఈవార్తలు): స తో ఓటరుగా గుర్తింపు పొందడానికి అర్హత సాధించవచ్చు అని, చొప్పదండి నియోజకవర్గం లో ఇప్పటికే 80% సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం మధురానగర్ లో సోమవారం స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ ( సర్) కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికలతో మాట్లాడి సకాలంలో ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. బిఎల్వోల ద్వారా ఇప్పటికే గ్రామాల్లో ఎనీమరేషన్ ఫారాలను అందజేసినట్లు తెలిపారు. ప్రజలు సకాలంలో ఏన్యుమరేషన్ ఫారాలను నింపి బిఎల్వో లకు సహకరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు సర్ ప్రక్రియలో పాల్గొని, ప్రజలకు, బిఎల్ఓ సహకరించాలని సూచించారు. మరణించిన వారి, డబుల్ ఓట్లను తొలగించడానికి సర్ ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు సహకరించి సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య,గునుకొండ బాబు, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు ముద్దం నగేష్,సర్పంచ్ లు వేముల భాస్కర్,రేండ్ల శ్రీనివాస్, దాసరి శంకరయ్య,లింగాల లింగయ్య,పడాల రాజన్న, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెల్మ క్రిష్ణ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు ,ధీకొండ మధు,గుజ్జుల బాపు రెడ్డి,పడితపల్లి కిషన్,కోల ప్రభాకర్,కంకణాల రాజ గోపాల్ రెడ్డి,రొమాల రమేష్, కర్ర బాపు రెడ్డి,రాచమల్ల భాస్కర్,బైరిశెట్టి సంపత్,వేముల అంజి ,చిరుత రమేష్,మెర్గ కొండయ్య,దాతు అంజి,పెంచాల చందు,కోలేపాక మల్లేష్ ,ఉప్పుగండ్ల మోహన్ రెడ్డి,ఉప్పుగండ్ల రామ్ రెడ్డి,పౌల్,రేండ్ల రాజి రెడ్డి,జుర్రు పరశురాం,చిందం రాజు,దులం అంజయ్య,గడ్డం అంజయ్య,జారతి సత్తయ్య,శనిగరపు నర్సయ్య,గంగాధర శ్రీకాంత్,తూము రాజు,దూలం వీరేశం,ఆకుల అంజన్న,గుడి ప్రవీణ్ రెడ్డి,ఏమిరెడ్డి నాగేందర్,గుండవేని తిరుపతి,పిట్టల కమలాకర్ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## తాటిపల్లి గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ

మల్యాల, జూలై 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి 6, 7, 8 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ చేపట్టనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మానస తెలిపారు. ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల 24లోపు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికేట్‌తో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# వేద సంస్కృతి పరిరక్షణకు ఎములాడ ముందడుగు

వేములవాడ అర్బన్, జూలై 20 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెలలో వేద సంస్కృతి పరిరక్షణకు ఉద్దేశించిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వేద విద్యా పరిరక్షణ, ప్రోత్సాహంలో భాగంగా జూలై 20 నుంచి 26 వరకు భీమేశ్వర సదన్ (మైత్రి గెస్ట్ హౌస్) సమీపంలో వేద పరీక్షలు నిర్వహించనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేద విద్యార్థులు పాల్గొని వేద పారాయణం, మంత్రోచ్ఛారణ, స్వరశుద్ధి తదితర అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు మూడు రోజుల పాటు వర్ణయాగంను వైభవంగా నిర్వహించనున్నారు. వేదోక్త విధానంలో జరిగే ఈ మహాయాగంలో రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సకాలంలో వర్షాలు, పాడిపంటల సమృద్ధి, దేశంలో శాంతి, సామరస్యం నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ను ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆదేశాల మేరకు డిప్యూటీ ఈవో నవీన్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగుల మహేష్, ఇన్‌చార్జ్ స్థానాచార్యులు నమ్మిలికొండ ఉమేష్, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ, వేద పరీక్షలు, వర్ణయాగం వంటి కార్యక్రమాలు వేద సంస్కృతి పరిరక్షణకు, యువతలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడానికి, సమాజ శ్రేయస్సు కోసం సామూహిక ప్రార్థనలకు దోహదపడతాయని పేర్కొన్నారు.

# లక్షల క్యూసెక్కుల నీరు వృథా

**రైతులు మాత్రం నీటి కోసం అల్లాడుతున్నారు**

**కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఎలాంటి నిషేధం లేదు**

**పోలీసుల అరాచకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం**

**మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం**

జగిత్యాల, జూలై 20 (ఈవార్తలు): కన్నెపల్లి పంప్ హౌస్ నుండి వెంటనే నీటిని ఎత్తిపోసి, కాపర్ డ్యాం నిర్మాణం చేపట్టి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాలలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. 4 దశాబ్దాల రాజకీయ జీవితంలో ఇంత అప్రజాస్వామికంగా పోలీసుల ప్రవర్తన చూడలేదన్నారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంట్ ఉండేదని, ఇప్పుడు ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడమే విద్యుత్ కోతలకు కారణమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈర్ష్యతో కన్నెపల్లి నుండి నీటిని ఎత్తిపోవడం లేదని, ఎన్డీఎస్ఎ నివేదికలో అలాంటి నిషేధం ఎక్కడా లేదని స్పష్టం చేశారు. లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుండి తక్షణమే నీటిని ఎత్తిపోయాలని, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. కాపర్ డ్యాం నిర్మాణం చేపట్టాలని, మెడిగడ్డపై ఆధారపడకుండా నీటిని ఎత్తిపోసేందుకు వీలవుతుందని, దీనికి సంబంధించిన నివేదిక ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉందన్నారు. విద్యుత్ కోతలు ఆపి రైతులకు సాగుకు సహకరించాలని, పత్తి, మొక్క జొన్న పంటలు వాడిపోతున్నాయని, దుక్కి దున్నేందుకు నీరు, కరెంటు లేవన్నారు. ప్రాజెక్టుల్లో నీరు అడుగంటడంతో రాష్ట్రంలో తాగునీటి సమస్య వచ్చే ప్రమాదం ఉందని, హైదరాబాద్ వాసులు సైతం వలస వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫుట్బాల్ మ్యాచ్కు 100 కోట్లు ఖర్చు చేసిన సీఎం, రైతుల కోసం 10 కోట్లు కేటాయించలేరా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు వినిపించేందుకు బీఆర్ఎస్ వెనకడుగు వేయదని హెచ్చరించారు.

# ఎల్లుండి నుంచి పోలీస్ జూడో క్లస్టర్ పోటీలు

**హైదరాబాద్‌లోని బాలయోగి స్టేడియంలో నిర్వహణ**

**ఐదు క్రీడాంశాల్లో పోటీపడనున్న 1600 మంది క్రీడాకారులు**




హైదరాబాద్, జూలై 20 (పీఐబీ): అఖిల భారత పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఏఐపీఎస్‌సీబీ) ఆధ్వర్యంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) నిర్వహించే 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్‌- 2026 హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎమ్‌సీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జూలై 23 నుంచి 30 వరకు జరగనుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో 36 రాష్ట్ర పోలీస్, కేంద్ర సాయుధ భద్రతా దళాల (సీఏపీఎఫ్) సంస్థలకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని జూడో, వుషు, టేక్వాండో, కరాటే, పెంచాక్ సిలాట్ క్రీడాంశాలలో పోటీపడనున్నారు. ఆయా జాతీయ సమాఖ్యలకు చెందిన దాదాపు 150 మంది సాంకేతిక అధికారులు ఈ పోటీలను పర్యవేక్షించనున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీలో (ఎన్ఐఎస్ఏ) నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో (కర్టెన్ రైజర్-కమ్-ప్రెస్ కాన్ఫరెన్స్) ఈ ఛాంపియన్‌షిప్ వివరాలను వెల్లడించారు. మీడియాను ఉద్దేశించి ఎన్ఐఎస్ఏ డైరెక్టర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీమతి హర్‌ప్రీత్ కౌర్ సోహి మాట్లాడుతూ.. ఈ ఛాంపియన్‌షిప్ పోలీస్, సీఏపీఎఫ్ సిబ్బందిలో క్రీడా సంస్కృతిని పెంపొందించడంతో పాటు అథ్లెట్లు తమ ప్రతిభను, క్రీడా నైపుణ్యాన్ని చాటుకోవడానికి ఒక జాతీయ వేదికను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఒలింపియన్ శ్రీ పారుపల్లి కశ్యప్, ప్రముఖ రోయింగ్ కోచ్ శ్రీ ఇస్మాయిల్ బైగ్ మాట్లాడుతూ.. యూనిఫాం ధరించే దళాలలో క్రమశిక్షణ, సహనశీలత, బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉద్ఘాటించారు. ఈ ఛాంపియన్‌షిప్ అథ్లెట్లను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు- 2026 రానున్న వేళ ఈ ఛాంపియన్‌షిప్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇందులో పోటీపడుతున్న అయిదు క్రీడల్లో జూడో, వుషు, టేక్వాండో, కరాటేలు ఆసియా క్రీడల్లో కూడా ఉన్నాయి. పోలీస్, సీఏపీఎఫ్‌లకు చెందిన అథ్లెట్లకు అంతర్జాతీయ స్థాయికి ఉపయోగపడే విలువైన పోటీ అనుభవాన్ని ఇది అందించనుంది. తెలంగాణ రాష్ట్ర జంతువైన మచ్చల జింక (చిటాల్) ఆధారంగా రూపొందించిన ఈ ఛాంపియన్‌షిప్ మస్కట్ 'వీరా'ను ఆవిష్కరించారు. ఇది సజీవత, ప్రభావశీలత, సహనశీలత, చురుకుదనం అనే గుణాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది మార్షల్ ఆర్ట్స్, భద్రతా దళాల స్ఫూర్తిని తెలియజేస్తోంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీ, ఇతర భాగస్వామ్య సంస్థలు రవాణా, నిర్వహణ సహకారాన్ని అందిస్తున్నాయి. నిర్ణీత నిబంధనలకు అనుగుణంగా నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) యాంటీ-డోపింగ్ పరీక్షలను నిర్వహిస్తుంది. పాల్గొనే క్రీడాకారులు, అధికారుల కోసం సమగ్రమైన వైద్య, వసతి ఏర్పాట్లను చేశారు.

# ఏడాదిగా రిలేషన్‌లో ఉన్నా

**మలుపు తిరిగిన ట్రైనీ ఐపీఎస్ వ్యవహారం**

హైదరాబాద్, జూలై 20 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపుల ఆరోపణల వ్యవహారంలో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం, ఆ తర్వాత ఆయన రాశారని చెబుతున్న ఒక లేఖ వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. తమ మధ్య ఉన్నది ఏకపక్ష వేధింపులు కావని, అది పరస్పర అంగీకారంతో కూడిన సంబంధమని... తామిద్దరం ఏడాదిగా రిలేషన్ షిప్ లో ఉన్నామని ఆయన ఆ నోట్‌లో పేర్కొనడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఉదయం ఎర్రగడ్డ మోతీ నగర్‌లోని బంధువుల నివాసంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. కుటుంబసభ్యులు వెంటనే ఆయన్ను ఎస్ఆర్ నగర్‌లోని జయంతి ఆసుపత్రికి తరలించారు. ఆయన శానిటైజర్ సేవించి ఆత్మహత్యకు యత్నించారని వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. అంతకుముందు, ఉదయ్ కృష్ణారెడ్డిపై కర్ణాటకకు చెందిన 30 ఏళ్ల వివాహిత, సహ ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి జూలై 10 మధ్య కాలంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధించారని, అసభ్యకర వాట్సాప్ సందేశాలు పంపారని ఆరోపించారు. జూలై 9న తనపై భౌతికంగా దాడి చేసి, జుట్టు పట్టుకుని లాగి, గొంతు నులిమి, కత్తితో బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రైవేట్ వీడియోను తన భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని కూడా ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులు, దాడి, క్రిమినల్ బెదిరింపులతో పాటు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలపై జాతీయ పోలీస్ అకాడమీ అంతర్గత విచారణ జరిపి, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం ఉదయ్‌ను అకాడమీ నుంచి తాత్కాలికంగా పంపించివేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఉదయ్ కృష్ణారెడ్డి రాశారని చెబుతున్న లేఖ వెలుగులోకి వచ్చింది. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, తమ మధ్య ఏడాదిగా రిలేషన్ షిప్ ఉందని ఆయన ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఆమెకు వివాహం అయిన తర్వాత కూడా సంబంధం కొనసాగిందని, ఆమె తన గదికి వచ్చిన వీడియో ఆధారాలు తన మొబైల్ ఫోన్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ విషయం గురించి తాను ఆమె భర్తకు కూడా తెలియజేశానని వెల్లడించారు. ఆమే తన గదికి వచ్చి తలుపు తెరవాలని బెదిరించిందని ఉదయ్ కృష్ణారెడ్డి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి, చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి నాయనమ్మ సంరక్షణలో పెరిగారు. 2013లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి, ఐదో ప్రయత్నంలో సివిల్స్‌లో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన స్ఫూర్తిదాయక ప్రయాణం అందరి ప్రశంసలు పొందింది. మహిళా అధికారిణి ఫిర్యాదు, ఉదయ్ కృష్ణారెడ్డి లేఖలోని అంశాలపై పోలీసులు రెండు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

# క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డులు

**3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ**

**వారంలో సీఎం రెడ్డి చేతుల మీదుగా పంపిణీ**



హైదరాబాద్, జూలై 20 (ఈవార్తలు): తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది. ఇదిలాఉంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు. అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

## మేక పిల్లల కోసం దారుణ హత్య

**ఏపీలోని నెల్లూరు జిల్లాలో ఘటన**

నెల్లూరు, జూలై 20 (ఈవార్తలు): ఏపీలోని నెల్లూరు జిల్లా కావలిలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. రెండు మేక పిల్లల పంపకం విషయంలో మొదలైన ఓ చిన్న గొడవ, చిలికి చిలికి గాలివానగా మారి ఒక యువకుడి ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ హత్య కేసులో గ్రామ పెద్ద, మాజీ సర్పంచే ప్రధాన నిందితుడిగా ఉండటం స్థానికంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. కావలి మండలం, సర్వాయపాలెం పంచాయతీ పరిధిలోని తాగేటివారిపాలేనికి చెందిన చాట్ల వాసు (26) మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన జనార్దన్ అనే వ్యక్తి తన మేకను సంరక్షణ కోసం వాసుకు అప్పగించాడు. ఇటీవల ఆ మేక ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. దీంతో, మేకను కాపలా కాసినందుకు తనకు రెండు పిల్లలను ఇవ్వాలని వాసు యజమాని జనార్దన్‌ను కోరాడు. అయితే, మేకలను కాయడానికి ప్రతి నెలా కూలీ ఇస్తున్నందున, అదనంగా పిల్లలను ఇవ్వడం కుదరదని జనార్దన్ తేల్చి చెప్పాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం మొదలైంది. ఈ గొడవను జనార్దన్ గ్రామ పెద్ద, మాజీ సర్పంచ్ అయిన మందా మధు దృష్టికి తీసుకెళ్లాడు. ఈ సమస్యపై పంచాయితీ జరుగుతున్న సమయంలో వాసుకు, మధుకు మధ్య మాటామాటా పెరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మధు, వాసుకు ఎలాగైనా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీన వాసును అడవిరాజుపాలెంలోని ఒక మద్యం దుకాణానికి పథకం ప్రకారం తీసుకెళ్లాడు. అక్కడ వాసుకు మద్యం తాగించిన తర్వాత, మధు తన ముగ్గురు అనుచరులతో కలిసి అతనిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలతో పడి ఉన్న వాసును గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.

## ప్రశ్నిస్తే దాడులా?

**కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్**

హైదరాబాద్, జూలై 20 (ఈవార్తలు): నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. "నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది.

**మీరిచ్చే ప్రతి పైసా..**
**ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

# నీళ్లిచ్చి ఆదుకోండి

**వరద కాలువకు నీటి విడుదల కోరుతూ రైతుల రాస్తారోకో**

**మల్యాల ఎక్స్ రోడ్డుపై బైఠాయింపు**

**జీవన్ రెడ్డి, సుంకె రవిశంకర్‌ను అడ్డుకున్న పోలీసులు**

మల్యాల, జూలై 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల క్రాస్ రోడ్డు వద్ద సోమవారం మండల రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. వరద కాలువలో వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్--జగిత్యాల ప్రధాన రహదారిపై బైఠాయించి, వరి నాట్లు పరిచి సుమారు 30 నిమిషాల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ప్రధాన రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మల్యాల, పెగడపల్లి ఎస్ఐలు సందీప్, కిరణ్ కుమార్ అక్కడికి చేరుకుని రైతులను ఒప్పించి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, వరద కాలువలో ఇప్పటికీ నీటి విడుదల జరగకపోవడంతో పంటల సాగు తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో సాగునీరు అందకపోతే వరితో పాటు ఇతర పంటలు కూడా ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతులు భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరద కాలువలో నీటిని విడుదల చేసి సాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు ఐక్య వేదిక నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, రైతుల ఆందోళన సమాచారం అందుకుని అక్కడికి బయలుదేరిన బీఆర్ఎస్ నేత, జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని నూకపల్లి--రాజారాం మధ్య పోలీసులు అడ్డుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను కొండగట్టు వద్ద నిలిపివేశారు. అనంతరం జీవన్ రెడ్డి పోలీసులను తప్పించుకుని వీఆర్‌కే కళాశాల సమీపంలో కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి నూకపల్లి వరద కాలువ వద్దకు చేరుకుని కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు జీవన్ రెడ్డిని తరలిస్తున్న క్రమంలో జీవన్ రెడ్డి ని పోలీస్ లు లక్కేళ్లడం తో అక్కడ కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. జీవన్ రెడ్డిని అక్కడినుంచి పోలీసులు జగిత్యాలకు తరలించారు.

## వేములవాడకు పోటెత్తిన భక్తజనం

వేములవాడ అర్బన్, జూలై 20 (ఈవార్తలు): క్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం భక్తులతో తీవ్ర రద్దీగా మారింది. పవిత్రమైన సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే తెలంగాణ నలుమూలల నుంచి భక్తులు వేములవాడకు భారీగా తరలివచ్చారు. ముందుగా పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆషాడ మాస వేడుకల్లో భాగంగా భక్తులు భీమేశ్వర స్వామివారికి పవిత్ర అభిషేకాలు జరిపించి, తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. ముఖ్యంగా క్షేత్ర ఆచార ప్రకారం భక్తులు పెద్ద ఎత్తున కోడె మొక్కులు చెల్లించి స్వామివారిపై ఉన్న తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్ల నిర్వహణతో పాటు తాగునీరు, నిత్య అన్నదానం ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేశారు.



## ముస్లిం కమిటీ అధ్యక్ష ఎన్నికకు ఏర్పాట్లు

జగిత్యాల, జూలై 20 (ఈవార్తలు): జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ నూతన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఈ మేరకు సోమవారం ఎన్నికల కమిషనర్ మొహమ్మద్ ఇమ్రాన్ అధ్యక్షతన ముస్లిం సెంట్రల్ ఎన్నికల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహణకు సంబంధించిన విధివిధానాలు, ఎన్నికల ప్రక్రియపై కమిటీ సభ్యులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ మొహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ, ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్ష ఎన్నికను పారదర్శకంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యుల అభిప్రాయాలను సేకరించి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ముస్లిం సెంట్రల్ ఎన్నికల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ టెండర్లను ఉపసంహరించాలి

**విద్యుత్ ఉద్యోగుల నల్లబ్యాడ్జీల నిరసన**

జగిత్యాల, జూలై 20 (ఈవార్తలు): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని వ్యతిరేకిస్తూ విద్యుత్ ఉద్యోగులు నిరసనకు దిగారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం జగిత్యాలలోని డివిజనల్ ఇంజనీర్ (డీఈ) కార్యాలయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఉదయం విధులకు హాజరైన ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ నిరసనను తెలిపారు. అనంతరం భోజన విరామ సమయంలో డీఈ కార్యాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టే ప్రయత్నం దుర్మార్గమని మండిపడ్డారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని కీలక విభాగాలను ప్రైవేటుపరం చేయడం వల్ల ఉద్యోగుల హక్కులకు, సంస్థ భవిష్యత్తుకు తీవ్ర ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే టెండర్ల ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ రాంజీ నాయక్, కన్వీనర్ ఆర్మల్ల ప్రసాద్, ఏఈలు సుందర్, సతీష్, శంకర్‌తో పాటు డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనకు సంఘీభావం తెలిపారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

**ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి**

ధర్మపురి, జూలై 20 (ఈవార్తలు): శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ధర్మపురి సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి అన్నారు. ప్రతి ఇంటి వద్ద, వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి పట్టణంలో సోమవారం ఎస్సై మహేశ్‌తో కలిసి పలు కూడళ్లు, దుకాణ సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు కీలక సూచనలు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతకు భరోసా లభిస్తుందని, దొంగతనాలు, వాహనాల అపహరణ, గొడవలు వంటి నేరాలను నివారించడంతోపాటు నేరాలు జరిగిన సందర్భంలో నిందితులను త్వరగా పట్టుకునేందుకు వీలవుతుందని సీఐ రాం నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఆరోపణలు నిజమైతే ఎమ్మెల్యేగా రిజైన్

**షుగర్ ఫ్యాక్టరీపై డాక్టర్ రఘు వ్యాఖ్యలు అనుచితం**

**బీఆర్ఎస్ నాయకుల మీడియా సమావేశం**

కోరుట్ల, జూలై 20 (ఈవార్తలు): షుగర్ ఫ్యాక్టరీ అంశంపై డాక్టర్ రఘు చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కావేరి గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రఘు.. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై షుగర్ ఫ్యాక్టరీ అంశంలో చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అనుచితమని పేర్కొన్నారు. డాక్టర్ రఘును ఉద్దేశించి బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ కోర్సు పూర్తిచేయడానికి సాధారణంగా ఐదున్నరేళ్లు పడుతుందని, అయితే డాక్టర్ రఘు 12 సంవత్సరాలు చదివారని అన్నారు. చదువు పూర్తిచేయడానికి ఎంత సమయం పట్టిందో.. రాజకీయాలు చేయడానికి కూడా అంతే సమయం పడుతున్నట్లుందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గత 20 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను అందించడం, బాధితుల ఇళ్లకు వెళ్లి మనోధైర్యం కల్పించడం, వ్యాక్సినేషన్ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఉచిత క్యాన్సర్ ఆరోగ్య శిబిరాలు, వివిధ వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి వైద్య సేవలు అందించారని, నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేశారని తెలిపారు.

## కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

**బీఆర్ఎస్ శ్రేణులకు కొప్పుల ఈశ్వర్ పిలుపు**

జగిత్యాల, జూలై 20 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా సమర్థవంతంగా తిప్పికొట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్‌కు పిలుపునిచ్చారు. ధర్మపురి నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొప్పుల ఈశ్వర్ సోషల్ మీడియా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసే పార్టీ అని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ, నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుత రాజకీయాల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, ప్రతి కార్యకర్త ఒక డిజిటల్ యోధుడిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే ప్రజా సమస్యలపై పార్టీ పోరాటంలో సోషల్ మీడియా వారియర్స్ ముందుండాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు అయ్యోరి రాజేష్తో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

# చిన్మయికి డబుల్ క్రౌన్.. షాన్వికి 2 స్వర్ణాలు

**ముగిసిన యోనెక్స్--సన్‌రైజ్ తెలంగాణ అండర్-15 బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్**




హైదరాబాద్, జూలై 19 (ఈవార్తలు):రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (బ్యాట్) అనుమతితో నిర్వహించిన యోనెక్స్--సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్ (అండర్-15) బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026 ఆదివారం మణికొండలోని మ్యాచ్ పాయింట్ ప్రైడ్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా ముగిసింది. మూడు రోజులపాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన యువ షట్లర్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బాలుర సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో అద్భుత ఆటతీరుతో చిన్‌మయ్ వాంకెడే విజేతగా నిలిచి డబుల్ క్రౌన్‌ను కైవసం చేసుకున్నాడు. బాలికల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో షాన్వి రెడ్డి నిమ్మ రెండు స్వర్ణ పతకాలు సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రవి కిశోర్ పాల్ చింత -- అన్యా ప్రొద్దుటూరు జోడీ ఛాంపియన్‌గా నిలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది. టోర్నీ ముగింపు సందర్భంగా విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి పి.యు. భాస్కర్ బాబు, పి. రమేష్ రెడ్డి, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సలహాదారు కె. లక్ష్మణ్, కోశాధికారి కె. వంశీధర్, జాయింట్ సెక్రటరీ (ఈవెంట్స్ అండ్ ప్లేయర్స్) యూవీఎన్ బాబు, ప్రముఖ కోచ్ జేవీఎస్ విద్యాధర్, మ్యాచ్ పాయింట్ ప్రైడ్ అకాడమీ నిర్వాహకుడు, కోచ్ ముప్పాల వేణు, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కారెడ్ల శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా యువ క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో మరింత కృషి చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. టోర్నీ విజయవంతానికి సహకరించిన క్రీడాకారులు, తల్లిదండ్రులు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, స్పాన్సర్లకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజన్న అన్నదాన ట్రస్టుకు 7.01 లక్షల విరాళం

వేములవాడ అర్బన్, జూలై 20 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన పసుల లక్ష్మీనారాయణ--జనాబాయి దంపతులు రూ.7,01,116 విరాళంగా అందజేశారు. ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో విరాళాన్ని అందజేసిన అనంతరం దాత పసుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుగ్రహంతోనే ఈ విరాళం సమర్పించే భాగ్యం కలిగిందని తెలిపారు. స్వామివారి సేవలో భాగస్వాములు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను శాలువాతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. దాతల కుటుంబానికి రాజరాజేశ్వర స్వామివారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీనివాస్, అకౌంట్స్ అడ్వైజర్ ఆగం రావు, రాకేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



# బెడ్‌సైడ్ కార్మికులపై శ్రమ దోపిడీ ఆపాలి

**ఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య**

హైదరాబాద్, జూలై 20 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సుమారు 18 వేల మంది బెడ్‌సైడ్ కార్మికుల శ్రమను ఏజెన్సీ కాంట్రాక్టర్లు దోపిడీ చేస్తున్నారని ఎస్‌పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఎస్‌పీఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, కాంట్రాక్టు గడువు ముగిసినా కొత్త టెండర్ ప్రక్రియ చేపట్టకుండా అదే ఏజెన్సీలతో కొనసాగించడం వల్ల కార్మికులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, 100 పడకల ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో గత రెండు దశాబ్దాలుగా శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్ సేవలు అందిస్తున్న కార్మికులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బెడ్‌సైడ్ కార్మికులను వెంటనే ఐఎఫ్ఎంఐఎస్ పరిధిలోకి తీసుకువచ్చి నెలకు కనీసం రూ.26 వేల స్థిర వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్ఎంఐఎస్‌లో విలీనం చేస్తేనే ఉద్యోగ భద్రత కలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏజెన్సీ కాంట్రాక్టర్లు కార్మికుల ఈపీఎఫ్, ఈఎస్ఐ నిధుల్లో అక్రమాలకు పాల్పడి లబ్ధి పొందారని ఆరోపించారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన పలువురు కార్మికులు మృతి చెందినా, వారి కుటుంబాలకు ఎలాంటి సహాయం అందలేదని, విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన కార్మికులకు కూడా బీమా ప్రయోజనాలు లభించలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించి బెడ్‌సైడ్ కార్మికులకు న్యాయం చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలను నిలిపివేసి మహాధర్నా నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య సేవలకు అరుదైన గుర్తింపు

**డా. ఎం. మనోజ్ రెడ్డికి లయన్స్ ఇంటర్నేషనల్ 'బెస్ట్ డాక్టర్ అవార్డు'**




ముషీరాబాద్, జూలై 20 (ఈవార్తలు): ప్రజారోగ్య సేవలను అంకితభావంతో అందిస్తూ వైద్య వృత్తిలో కరుణ, నిబద్ధత, నాయకత్వ లక్షణాలతో ఆదర్శంగా నిలుస్తున్న ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఖుాఎఐ) సివిల్ అసిస్టెంట్ సర్జన్ డా. ఎం. మనోజ్ రెడ్డి గారికి లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ డాక్టర్ అవార్డు'తో పాటు 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ప్రదానం చేసింది. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం, వ్యాధి నిరోధక చర్యలు చేపట్టడం, ఆరోగ్య అవగా హన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వంటి అంశాలను గుర్తించి లయన్స్ ఇంటర్నేషనల్ ఈ గౌరవాన్ని అందించింది. డా. మనోజ్ రెడ్డి రోగుల పట్ల చూపుతున్న ఆప్యాయత, సేవాభావం, వృత్తిపరమైన నిబద్ధతతో పాటు ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా విశేషంగా కృషి చేస్తున్నారని పలువురు ప్రశంసించారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్న సందర్భంగా వైద్య సహచరులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్నేహితులు, స్థానిక ప్రజలు డా. మనోజ్ రెడ్డి గారిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## ఆల్ ఇంగ్లండ్ జూనియర్ ఓపెన్‌లో తెలంగాణ కుర్రాడు చరిత్ర

**అండర్-19 బాలుర సింగిల్స్ టైటిల్ గెలిచిన తొలి భారతీయుడు**

హైదరాబాద్/లండన్, జూలై 20 (ఈవార్తలు): తెలంగాణకు చెందిన యువ షట్లర్ సాయి నచికేత్ భత్రాజు అంతర్జాతీయ వేదికపై చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక యోనెక్స్ ఆల్ ఇంగ్లండ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్--2026 అండర్-19 బాలుర సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకొని, ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. ఫైనల్లో భారత ఆటగాడు కె. సుహాస్పై విజయం సాధించిన సాయి నచికేత్, టోర్నమెంట్ మొత్తం అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ఛాంపియన్‌గా అవతరించాడు. తెలంగాణ యువ క్రీడాకారుడి ఈ చారిత్రక విజయం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచింది. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో సాయి నచికేత్ పేరు చిరస్థాయిగా నిలిచే విజయంగా క్రీడా వర్గాలు అభివర్ణిస్తున్నాయి.



## క్లాస్‌రూమ్‌ల కేటాయింపుపై రగడ

జగిత్యాల టౌన్, జూలై 20 (ఈవార్తలు): జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్లాస్‌రూమ్‌ల కేటాయింపు వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను తమకు కేటాయించొద్దంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. కొత్తగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు తమ తరగతి గదులను కేటాయించారని ఆరోపిస్తూ.. తమ క్లాస్‌రూమ్‌లను తమకే కేటాయించాలని విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌ను కోరారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ తమతో దుర్భాషలాడారని ఆరోపిస్తూ విద్యార్థులు జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కళాశాలలో నెలకొన్న సమస్యపై యాజమాన్యం వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. క్లాస్‌రూమ్‌ల కేటాయింపుపై తలెత్తిన వివాదం విద్యార్థుల్లో ఆందోళనకు కారణమైంది.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్‌తో ఇబ్బందులు: జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బీఆర్ఎస్ నేత జీవన్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని బీఎల్ఓకు తమ వివరాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో 1987, 2002లో చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియతో పోలిస్తే ప్రస్తుత ఎస్ఐఆర్‌లో మ్యాపింగ్ నిబంధనలు ఓటర్లకు ఇబ్బందికరంగా మారుతున్నాయన్నారు. వివాహం ద్వారా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి జగిత్యాలలో స్థిరపడిన వివిధ వర్గాల ప్రజలకు మ్యాపింగ్ ప్రక్రియ సమస్యగా మారుతోందన్నారు. 2002లో అమలు చేసిన విధానాన్నే అనుసరించాలని కోరారు. డూప్లికేట్ ఓట్లను తొలగించడంతో పాటు స్థిర నివాసం ఉన్న ఏ ఒక్కరి ఓటు కూడా తొలగిపోకుండా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జగిత్యాల పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 61 శాతం పూర్తయిందని, ఓటర్ల నమోదు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఒక వ్యక్తికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉండటం ఎన్నికల నిబంధనల ప్రకారం నేరమన్నారు. బీఆర్ఎస్ తరఫున బూత్ లెవెల్ ఏజెంట్లు ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని, ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా పార్టీ తరఫున కృషి చేస్తున్నామని జీవన్‌రెడ్డి తెలిపారు.





## జర్నలిస్టు ఖాజా సల్మాన్‌కు గౌరవ డాక్టరేట్

జగిత్యాల, జూలై 20 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని గంజ్ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్టు ఖాజా సల్మాన్కు ఆయన చేస్తున్న విశిష్ట సామాజిక సేవలకు గుర్తింపుగా సహారా చారిటేబుల్ ట్రస్ట్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ఖాజా సల్మాన్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేసి సత్కరించారు. గత కొన్నేళ్లుగా ఆయన జర్నలిజంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్నందుకు ఈ గుర్తింపును ప్రకటించినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఖాజా సల్మాన్‌ను జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



## గౌడ హక్కుల పోరాట సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా రాగుల

జగిత్యాల, జూలై 20 (ఈవార్తలు): రాష్ట్ర గౌడ జన హక్కుల పోరాట సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించి నందుకు రాష్ట్ర అధ్యక్షుడు అమరగోని నర్సాగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్లకు నూతన జిల్లా అధ్యక్షుడు రాగుల పరశురాం గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలోని గౌడ కుల బాంధవులు, గీతా కార్మికుల సంక్షేమం కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. గౌడ కులస్తుల హక్కుల పరిరక్షణతో పాటు వారికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన సంక్షేమ పథకాలు, ఫలాలు అందేలా నిరంతరం పోరాడతానని పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తూ, జిల్లా వ్యాప్తంగా గౌడ కుల బాంధవులను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు బాధ్యతాయుతంగా సేవలందిస్తానని తెలిపారు.

## పోలీసులా.. కాంగ్రెస్ కార్యకర్తలా?

**ప్రజాస్వామ్యంలో మాట్లాడే హక్కు లేదా?**

**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్**

మల్యాల, జూలై 20 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వంలో అడుగడుగునా అరెస్టులు, నిర్బంధాలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యంలో మాట్లాడే హక్కు కూడా లేదా? అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్యాల మండలంలోని రైతులు వరద కాలువకు నీటిని వెంటనే విడుదల చేయాలని చేపట్టిన నిరసనకు మద్దతు తెలిపేందుకు సోమవారం వెళ్తున్న తనను కొండగట్టు సమీపంలో పోలీసులు అడ్డుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ.. "మీరు పోలీసులా.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా?" అంటూ పోలీసులను ప్రశ్నించారు. మరోచోట కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రెడ్డిని అడ్డుకోవడంపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వరద కాలువకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని రవిశంకర్‌ను తమ వాహనంలో అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లాఠీ చార్జి అప్రజాస్వామికం: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: నీట్ పరీక్షల్లో అక్రమాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత అప్రజాస్వామికమని, భారతీయ సంప్రదాయానికి విరుద్ధమని ఆయన కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తరుణంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు ఢిల్లీ వేదికగా నిరసన చేపట్టారు. నీట్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీలు, ఇతర అక్రమాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న తోపులాటతో ఉద్రిక్తత నెలకొనగా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేసి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. "ఢిల్లీ వీధుల్లో నిరసన తెలుపుతున్న వారు నేరస్థులు కాదు, తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు. వారిపై బలప్రయోగం చేయడం తగదు" అని ఆయన హితవు పలికారు. దేశంలో 152 పేపర్ లీకేజీల వల్ల సుమారు 7.5 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నా, ప్రభుత్వం మాత్రం బాధ్యులను కాపాడటానికే ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

# ఎల్ఐసీ వద్ద 7,400 కోట్ల అన్‌క్లెయిమ్డ్ నిధులు

**పాలసీదారులకే అందిస్తామని స్పష్టం చేసిన కేంద్రం**

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) వద్ద సుమారు రూ.7,400 కోట్ల మేర క్లెయిమ్ చేయని నిధులు ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పాలసీదారులకు లేదా వారి నామినీలకు చేరాల్సిన ఈ భారీ మొత్తం.. అవగాహన లోపం, చిరునామాలు మారడం, రికార్డుల్లో వివరాలు సరిగా లేకపోవడం వంటి కారణాల వల్ల పేరుకుపోయినట్లు తెలిపింది. క్లెయిమ్ చేయని పాలసీదారుల నిధులు రూ.5,564.5 కోట్లు కాగా, వాటిపై వచ్చిన ఆదాయం రూ.1,754 కోట్లుగా ఉందని మంత్రిత్వ శాఖ వివరించింది. పాలసీ మెచ్యూరిటీ, డెత్ క్లెయిమ్‌లు, సర్వైవల్ బెనిఫిట్స్ వంటి ప్రయోజనాలను గడువు ముగిసిన 12 నెలల తర్వాత కూడా తీసుకోని పక్షంలో, వాటిని 'అన్‌క్లెయిమ్డ్ నిధులు'గా పరిగణిస్తారు. ఈ నిధులను ఇతర అవసరాలకు మళ్లించే ఉద్దేశం లేదని, అర్హులైన క్లెయిమ్ దారులకు వాటిని తిరిగి అందజేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు, చిన్న మొత్తాల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు.. ఆధార్‌తో అనుసంధానమైన లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.1,000 వరకు నిధులను నేరుగా జమ చేసే పైలట్ ప్రాజెక్టును ఈపీఎఫ్ఓ ప్రారంభించింది. నిద్రాణంగా ఉన్న చిన్న మొత్తాల సంఖ్యను తగ్గించడం, అర్హులైన ఖాతాదారులకు ఆ నిధులను సత్వరం బదిలీ చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

# 'రాజు ఆమ్లెట్' సృష్టికర్త కన్నుమూత

దుబాయ్: దుబాయ్‌లో ప్రఖ్యాత రెస్టారెంట్ చైన్ 'రాజు ఆమ్లెట్' వ్యవస్థాపకుడు, భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త రాజీవ్ మెహెరిష్ జులై 19న కన్నుమూశారు. కేవలం గుడ్డుతో వినూత్న వంటకాలను అందిస్తూ దుబాయ్‌లో ఒక విజయవంతమైన బ్రాండ్‌ను నిర్మించిన ఆయన ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం. ముంబై యూనివర్సిటీలో కామర్స్‌లో పీజీ పూర్తి చేసిన రాజీవ్, 1980లో మెరుగైన అవకాశాల కోసం దుబాయ్ వెళ్లారు. తొలినాళ్లలో సేల్స్ రంగంలో పనిచేసి, ఆ తర్వాత 'ఖలీజ్ టైమ్స్' వంటి పత్రికలకు అడ్వర్టైజింగ్ స్పేస్ అమ్ముతూ కెరీర్ కొనసాగించారు. గుజరాత్‌లోని వడోదరలో ఉన్న 'రాజు ఆమ్లెట్' అనే చిన్న రోడ్డు పక్కన కొట్టును చూసి స్ఫూర్తి పొందిన ఆయన, ఆ ఆలోచనను దుబాయ్‌లో అమలు చేయాలని నిర్ణయించుకున్నారు. తన కుమారుడు నకుల్ మెహెరిష్‌తో కలిసి దుబాయ్‌లోని కరామా ప్రాంతంలో 18 సీట్ల సామర్థ్యంతో చిన్న రెస్టారెంట్‌ను ప్రారంభించారు. మొదట్లో కొన్ని రకాల ఆమ్లెట్లతో మొదలైన ఈ రెస్టారెంట్, క్రమంగా ఆమ్లెట్లు, భుర్జీ, ఎగ్స్ కేజ్రీవాల్ వంటి పదుల సంఖ్యలో వినూత్న వంటకాలతో విస్తరించింది. సరసమైన ధరలు, ఆకట్టుకునే భారతీయ స్ట్రీట్-స్టైల్ ఇంటీరియర్‌తో రాజు ఆమ్లెట్ స్థానికులు, పర్యాటకులతో పాటు దుబాయ్ రాజకుటుంబ సభ్యులను సైతం ఆకర్షించింది. కేవలం ఒకే ఒక పదార్థంతో (గుడ్డు) విజయవంతమైన వ్యాపారాన్ని ఎలా నిర్మించవచ్చో వివరిస్తూ 'రాజు ఆమ్లెట్' ప్రస్థానం హార్వర్డ్ బిజినెస్ రివ్యూలో కేస్ స్టడీగా చోటు సంపాదించడం విశేషం. ఒక చిన్న ఆలోచనను సృజనాత్మకత, నిలకడతో ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా మార్చిన రాజీవ్ ప్రయాణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

# రుపీ చెల్లింపుల్లో క్లాడ్ ఏఐ సబ్ స్క్రిప్షన్

న్యూఢిల్లీ: ప్రముఖ కృత్రిమ మేధ (ఏఐ) సంస్థ 'ఆంత్రోపిక్' తన క్లాడ్ ఏఐ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లలో కీలక మార్పులు చేపట్టింది. తమ అత్యంత అధునాతన మోడల్ అయిన 'క్లాడ్ ఫేబుల్ 5' యాక్సెస్‌పై పలువురు పెయిడ్ యూజర్లకు పరిమితులు విధిస్తూనే, భారత మార్కెట్ కోసం ప్రత్యేకంగా రూపాయల్లో ధరలను ప్రవేశపెట్టింది. ఈ నూతన విధానం నేటి నుంచే అమల్లోకి వచ్చింది. 'క్లాడ్ ప్రో', 'టీమ్ స్టాండర్డ్' వినియోగదారులు ఇకపై ఫేబుల్ 5 మోడల్‌ను నేరుగా పొందే అవకాశం ఉండదు. దీనిని వినియోగించాలంటే 'ఏపీఐ' లేదా క్రెడిట్స్ ద్వారా వాడకం ఆధారంగా చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు, 'క్లాడ్ మ్యాక్స్', 'టీమ్ ప్రీమియం' సబ్‌స్క్రైబర్లకు ఫేబుల్ 5 యాక్సెస్ కొనసాగినప్పటికీ, దాని వినియోగ పరిమితిని 50 శాతం తగ్గించారు. ఈ మార్పుల వల్ల ప్రభావితమయ్యే యూజర్లకు ఊరటగా కంపెనీ ఒకేసారి 100 డాలర్ల క్రెడిట్‌ను అందిస్తోంది. అదే సమయంలో, భారతీయ వినియోగదారుల కోసం ఆంత్రోపిక్ రూపాయల్లో చెల్లింపుల సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. జీఎస్టీతో కలిపి 'క్లాడ్ ప్రో' ప్లాన్‌కు నెలకు రూ. 2,399 లేదా వార్షిక ప్లాన్ తీసుకుంటే నెలకు రూ. 2,000గా ధరను నిర్ణయించింది. అమెరికా తర్వాత క్లాడ్ ఏఐకి భారత్ రెండో అతిపెద్ద మార్కెట్ కావడంతో ఈ నిర్ణయం వ్యూహాత్మకంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఫేబుల్ 5 వంటి అత్యాధునిక ఏఐ మోడళ్ల నిర్వహణకు అవుతున్న అధిక వ్యయాలు, భారీగా పెరిగిన డిమాండ్‌ను తట్టుకునేందుకే ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. అయితే, మౌలిక సదుపాయాల సామర్థ్యం మెరుగుపడిన తర్వాత ఫేబుల్ 5 యాక్సెస్‌ను తిరిగి సాధారణ సబ్‌స్క్రిప్షన్లలో చేర్చే అవకాశం ఉందని కంపెనీ సంకేతాలిచ్చింది.

# త్రిపుర డీజీపీ ఆత్మహత్య

అగర్తల: త్రిపుర రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనురాగ్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. అగర్తలలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లోనే ఆయన తుపాకితో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. డీజీపీ అనురాగ్ తన కార్యాలయంలోని బాత్రూంలో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. హుటాహుటిన ఆయన్ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## 30 వేల హ్యుందాయ్
# చార్జింగ్ స్టేషన్లు
## అన్ని బ్రాండ్ల వాహనాలకు అందుబాటులో

**హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) నేడు కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) వినియోగదారుల కోసం తమ 'మైహ్యుందాయ్' యాప్ ద్వారా 30,000కు పైగా చార్జింగ్ పాయింట్లను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. ఒకే ప్లాట్‌ఫామ్‌పై లభించే భారతదేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఈవీ చార్జింగ్ నెట్‌వర్క్‌లలో ఒకటిగా ఇది నిలిచింది.**



న్యూఢిల్లీ: ప్రముఖ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఈ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేసినట్లు కంపెనీ తెలిపింది. విశేషమేమిటంటే, ఈ నెట్‌వర్క్ కేవలం హ్యుందాయ్ కార్లకే పరిమితం కాకుండా అన్ని బ్రాండ్ల ఎలక్ట్రిక్ వాహనాలకు అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా సమీపంలోని చార్జింగ్ స్టేషన్లను గుర్తించడం, వాటికి నావిగేట్ చేయడం, ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవడం, డిజిటల్ పద్ధతిలో చెల్లింపులు జరపడం వంటివి సులభంగా చేసుకోవచ్చు. ఈ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా దేశవ్యాప్తంగా సగటున 25 కిలోమీటర్ల పరిధిలో ఒక చార్జింగ్ స్టేషన్ అందుబాటులో ఉంటుందని హ్యుందాయ్ పేర్కొంది. ఢిల్లీ-జైపూర్, ముంబై-పూణే-బెంగళూరు, హైదరాబాద్-కర్నూలు-బెంగళూరు వంటి ప్రధాన హైవే కారిడార్లలో కూడా ఈ సౌకర్యం విస్తరించింది. ఈ సందర్భంగా హెచ్ఎంఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ తరుణ్ గర్గ్ మాట్లాడుతూ.. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడంలో చార్జింగ్ మౌలిక సదుపాయాలు చాలా కీలకమని అన్నారు. "మైహ్యుందాయ్ యాప్‌లో 30,000కు పైగా చార్జింగ్ పాయింట్లను ఏకీకృతం చేయడం ద్వారా, ఈవీ యూజర్లకు దేశంలోని అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకదానిని అందిస్తున్నాము. ఈ ప్లాట్‌ఫామ్‌ను అన్ని బ్రాండ్ల ఈవీ యజమానులకు అందుబాటులో ఉంచడం ద్వారా, భారతదేశ ఈవీ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి మా నిబద్ధతను చాటుతున్నాం" అని ఆయన వివరించారు. ఇది మాత్రమే కాకుండా కంపెనీ తన సొంత డీసీ ఫాస్ట్ పబ్లిక్ చార్జింగ్ నెట్‌వర్క్‌ను కూడా భారీగా విస్తరించాలని యోచిస్తోంది. ప్రస్తుతం ఉన్న 183 స్టేషన్లను 2030 నాటికి 600 స్టేషన్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు తమ చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా 3 లక్షలకు పైగా చార్జింగ్ సెషన్‌లు జరిగాయని, దీనివల్ల సుమారు 3.5 మిలియన్ కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను నివారించగలిగామని కంపెనీ తెలిపింది. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మాస్ మార్కెట్ కోసం ఒక కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని విడుదల చేయడానికి కూడా హ్యుందాయ్ సన్నాహాలు చేస్తోంది.

# 90 డాలర్ల మార్క్ దాటిన బ్యారెల్ ధర

న్యూఢిల్లీ: అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల మార్క్‌ను దాటింది. హర్మూజ్ జలసంధి మీదుగా చమురు సరఫరాలకు అంతరాయం కలగొచ్చనే ఆందోళనతో మార్కెట్లలో కొనుగోళ్లు పెరిగాయి. దీంతో గత రెండు రోజులుగా చమురు ధరలు వరుసగా ఎగబాకుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర సోమవారం దాదాపు మూడు శాతం పెరిగి బ్యారెల్‌కు 90 డాలర్లను దాటింది. అంతకుముందు ట్రేడింగ్ సెషన్‌లో కూడా ఇదే స్థాయిలో పెరుగుదల నమోదైంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ కూడా 3.5 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 85.39 డాలర్ల వద్ద ట్రేడైంది. దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఆగస్టు క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు కూడా జోరందుకున్నాయి. ఉదయం ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు రూ.210 పెరిగి రూ.8,120 ఇంట్రాడే గరిష్ఠ స్థాయికి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావమే దేశీయ ధరలపైనా కనిపించింది. వారాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య సైనిక చర్యలు మరింత తీవ్రం కావడం మార్కెట్లను కలవరపరిచింది. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో లేదని టెహ్రాన్ ప్రకటించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. అమెరికా సెంట్రల్ కమాండ్ వరుసగా తొమ్మిదో రోజు ఇరాన్‌కు చెందిన లక్ష్యాలపై దాడులు నిర్వహించినట్లు సోమవారం ప్రకటించింది. వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై దాడులకు తెగబడుతున్న ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపర్చడమే తమ లక్ష్యమని తెలిపింది. మరోవైపు హర్మూజ్ జలసంధిలో నాలుగు నౌకలను అడ్డుకున్నట్లు ఇరాన్ నౌకాదళం వెల్లడించింది. వాటిలో రెండు ప్రమాదాలకు గురికాగా, మరో రెండు వెనక్కి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ముడి చమురు ధరలు సమీప కాలంలో బలంగానే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ధరలు ఇప్పటికే గణనీయంగా పెరగడంతో మధ్య మధ్యలో స్వల్ప స్థిరీకరణ కూడా కనిపించవచ్చని విశ్లేషిస్తున్నారు.

# విజయ్‌కు బెదిరింపులు.. డీఎంకే ఎమ్మెల్యే అరెస్ట్!

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్‌పై బహిరంగంగా బెదిరింపు వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై విలాతికుళం నియోజకవర్గ డీఎంకే ఎమ్మెల్యే జి.వి.మార్కండేయన్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్ట్ చేశారు. కొవిల్‌పట్టిలో జరిగిన పార్టీ బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడిన మాటల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. కొవిల్‌పట్టిలోని కృష్ణన్ కోవిల్ మైదానంలో ఆదివారం రాత్రి డీఎంకే పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభకు ఎమ్మెల్యే ఐ.కరుణానిధితో పాటు పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు హాజరయ్యారు. ఈ వేదికపై మార్కండేయన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ పనితీరు, ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి విజయ్‌ను తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. ఈ క్రమంలోనే ఆయన తీవ్ర పదజాలంతో విరుచుకుపడుతూ.. "అసెంబ్లీ కనుక సమావేశమైతే నీ ఎముకలు మిగలవు, మా డీఎంకే శాసనసభ్యులు నీ ఎముకలు విరగ్గొట్టి నిన్ను వెనక్కి పంపుతారు" అంటూ నేరుగా ముఖ్యమంత్రికే హెచ్చరికలు జారీ చేశారు. ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు.. సోమవారం తెల్లవారుజామునే విలాతికుళంలోని మార్కండేయన్ నివాసానికి చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

# అయోధ్యపై రాజకీయం వద్దు

**పార్టీలకు సుప్రీం కోర్టు హెచ్చరిక**





న్యూఢిల్లీ: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిర విరాళాల దారిమళ్లింపు కేసును రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా హెచ్చరించింది. ఈ కేసులో సీబీఐ విచారణ జరిపించాలని, ట్రస్టు ఆర్థిక లావాదేవీలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. "ఇది కేవలం నేరపూరిత చర్యకు సంబంధించిన ఒక సాధారణ కేసు. ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని మేము హెచ్చరిస్తున్నాము" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న దర్యాప్తు పురోగతిపై సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత తగిన ఆదేశాలు జారీ చేస్తామని కోర్టు పేర్కొంది. భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులోని కొందరు వ్యక్తులు దారిమళ్లించారన్న ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. యూపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక విచారణ అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. దర్యాప్తు కొనసాగుతున్నందున, మరిన్ని వివరాలను ప్రస్తుతం బహిర్గతం చేయలేమని ఆయన తెలిపారు. ఈ కేసులో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిగేలా సిట్‌ను పునర్వ్యవస్థీకరించే అంశంపై సూచనలు తీసుకోవాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, తప్పుడు ప్రచారాలకు ఆస్కారం ఉంటుందన్న కారణంతో ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్న అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. పారదర్శకత కోసం పక్కాగా రికార్డులను నిర్వహించాలని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపిస్తూ, బంగారం, వెండి వస్తువులు అదృశ్యమవుతున్నాయని, విరాళాలకు సరైన లెక్కలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణ సమయంలో భక్తులకు జారీ చేసిన రసీదులను ఒక వెబ్‌సైట్‌లో ఉంచాలని, తద్వారా దాతలు తమ విరాళాలు ట్రస్ట్‌కు చేరాయో లేదో సరిచూసుకోవచ్చని ఆయన సూచించారు. అయితే, ఈ ప్రతిపాదనను ప్రధాన న్యాయమూర్తి తోసిపుచ్చారు.



# స్టాక్ మార్కెట్లకు భారీ నష్టాలు

ముంబై: అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితికి తోడు, దేశీయంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి దారితీసింది. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 443 పాయింట్లు నష్టపోయి 77,708.52 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 96 పాయింట్లు క్షీణించి 24,238.50 వద్ద ముగిసింది. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,300--24,400 జోన్ తక్షణ నిరోధకంగా కొనసాగుతోంది. ఈ స్థాయిని నిలకడగా అధిగమిస్తేనే బుల్స్ పట్టు సాధించి, సూచీ 24,500--24,600 స్థాయిల వైపు పయనించే అవకాశం ఉంటుంది. ఒకవేళ సూచీ కిందకు వస్తే, 24,100 వద్ద తక్షణ మద్దతు లభిస్తుందని, ఈ స్థాయిని కోల్పోతే లాభాల స్వీకరణ పెరిగి 24,000 సైకలాజికల్ మార్క్ వరకు పడిపోవచ్చని హెచ్చరిస్తున్నారు. సెషన్ మొత్తంలో బ్యాంకింగ్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి సుజుకి ఇండియా షేర్లు నిఫ్టీలో టాప్ లూజర్లుగా నిలిచాయి. సూచీలు నష్టపోయినప్పటికీ, బ్రాడర్ మార్కెట్ మాత్రం రాణించడం గమనార్హం. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.6 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.16 శాతం లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు తీవ్రంగా నష్టపోగా, నిఫ్టీ ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు లాభాలతో ముగిశాయి.

# పనిచేయనిస్తలేరు.. సగం జీతమే ఇవ్వండి

**యూపీ ఐఏఎస్ సంచలన లేఖ**

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ యువ ఐఏఎస్ అధికారి రాసిన లేఖ తీవ్ర చర్చకు దారి తీసింది. తనకు పూర్తి స్థాయిలో పని లేకపోవడంతో సగం జీతమే చెల్లించాలని, లేదంటే నిబంధనల ప్రకారం పని చేసే అవకాశం ఉన్న చోటుకు బదిలీ చేయాలని కోరుతూ రాష్ట్ర నియామక, సిబ్బంది శాఖకు ఐదు పేజీల లేఖ పంపారు. ప్రస్తుతం ఎస్‌డీఎం (జ్యుడీషియల్)గా పనిచేస్తున్న 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రింకూ సింగ్ రాహీ ఈ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం తన బాధ్యతల్లో రోజుకు సుమారు నాలుగు గంటల పని మాత్రమే ఉంటోందని రాహీ లేఖలో పేర్కొన్నారు. అందుకే ఈ పోస్టులోనే కొనసాగిస్తే సగం జీతం చెల్లించినా అభ్యంతరం లేదని తెలిపారు. అదే సమయంలో పరిపాలనా వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉందని ఆరోపిస్తూ రాష్ట్ర మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్, బీజేపీ ఎమ్మెల్యే గౌరీ శంకర్ వర్మ పేర్లను కూడా ప్రస్తావించారు. జలౌన్‌లో ఎస్‌డీఎంగా పనిచేసే సమయంలో అక్రమ భూకబ్జాలు, ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారాల్లో చర్యలు తీసుకోవద్దని జిల్లా కలెక్టర్ తనకు ఆదేశించారని రాహీ ఆరోపించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే గౌరీ శంకర్ వర్మ కూడా అక్కడే ఉన్నారని పేర్కొన్నారు. మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్‌కు సంబంధించిన అక్రమ ఆక్రమణల ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరగకుండా అడ్డుకునేందుకు కుట్ర జరిగిందని కూడా లేఖలో ఆరోపించారు. లక్నోలో జరిగిన అగ్నిప్రమాదం తర్వాత జలౌన్‌లోని రాంరాజా నిరంజన్‌కు చెందిన కోల్డ్ స్టోరేజీని తాను తనిఖీ చేశానని రాహీ తెలిపారు. అక్కడ నిర్వహించిన మాక్ ఫైర్‌డ్రిల్‌లో అగ్నిమాపక ఏర్పాట్లు సరిగా లేవని గుర్తించానన్నారు. కోల్డ్ స్టోరేజీ నిర్వహణకు సంబంధించిన పలు కీలక పత్రాలు కూడా అందుబాటులో లేవని నివేదిక కోరినట్లు వెల్లడించారు. ఈ వివాదంపై విచారణ కమిటీ నివేదిక రాకముందే తనను హడావుడిగా ఎస్‌డీఎం (జ్యుడీషియల్)గా బదిలీ చేశారని రాహీ ఆరోపించారు. జలౌన్ జిల్లా పరిపాలన తీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన 'జనతా దర్శన్' కార్యక్రమం కేవలం పేరుకే జరుగుతోందని, మూల సమస్యలను పరిష్కరించకుండా తాత్కాలిక చర్యలకే పరిమితమవుతోందని విమర్శించారు. నిబంధనల ప్రకారం స్వేచ్ఛగా పని చేసే అవకాశం ఉన్న మరో తహసీల్‌కు లేదా మరో జిల్లాకు బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని రాహీ కోరారు. అది సాధ్యం కాకపోతే మరో రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై పంపాలని కూడా విజ్ఞప్తి చేశారు.

వయ్యారి చిత్రం







## చెన్నై లవ్ స్టోరీ.. ఓవర్ హైప్

యువ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీప్రియా జంటగా నటిస్తున్న లేటెస్ట్ రొమాంటిక్ డ్రామా 'చెన్నై లవ్ స్టోరీ' మరికొద్ది రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్ జోరుగా సాగుతున్న ఈ తరుణంలో ఈ చిత్రం రన్‌టైమ్, ప్రమోషన్స్ స్ట్రాటజీ గురించి నెట్టింట ఒక ఆసక్తికరమైన విశ్లేషణ మొదలైంది. సినిమా విడుదల కాకముందే మేకర్స్ దీన్ని ఒక 'కల్ట్', 'ఎమోషనల్ రైడ్' అని పదే పదే ప్రమోట్ చేస్తున్నారు. ఒకప్పుడు ఒక సినిమా థియేటర్లలోకి వచ్చి, అందులోని కంటెంట్ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చినప్పుడు వారే దాన్ని ఒక 'కల్ట్ క్లాసిక్' గా మార్చేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ పూర్తిగా రివర్స్ అయింది. ఇక మేకర్స్ తమకు తామే ముందుగా అలాంటి పవర్‌ఫుల్ ట్యాగ్‌లు వేసుకుని మార్కెట్ చేస్తున్నారు. దీనివల్ల సాధారణ ఆడియన్స్‌లో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతాయి. ఇక ఈ తరహా ఓవర్-హైప్ ప్రమోషన్ స్ట్రాటజీ ఒకవేళ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే పెద్ద ప్లస్ అవుతుంది కానీ, థియేటర్లలో కంటెంట్ ఏమాత్రం తేడా కొట్టినా అంతే వేగంగా నెగెటివ్ టాక్‌గా మారి సినిమాను ముంచేసే ప్రమాదం ఉంది.

## కాజల్ సెకండ్ ఇన్నింగ్స్ అప్ అండ్ డౌన్!

దశాబ్దంన్నరకు పైగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో చందమామగా వెలిగిపోయిన కథానాయిక కాజల్ అగర్వాల్. ఎంతో మంది అగ్రనటుల సరసన నటించింది. స్టార్ హీరోయిన్‌గా తనదైన ముద్ర వేసింది. అయితే 2020లో వివాహం చేసుకున్న తర్వాత సినిమాల్లో వేగం ఒక్కసారిగా తగ్గింది.



పెళ్లి తర్వాత కూడా నటనను కొనసాగి స్తున్నప్పటికీ? గతంలో ఉన్నంత జోరు సెకండ్ ఇన్నింగ్స్‌లో కనిపించడం లేదు. ఈ నాలుగైదు ఏళ్లలో ఆమె చేసిన చిత్రాల సంఖ్య చాలా పరిమితంగా ఉండటంతో అమ్మడు చర్చనీయాంశమవుతోంది. వివాహానంతరం కాజల్ ఎంచుకున్న ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద సందడి చేయలేకపోయాయి. కమర్షియల్ చిత్రాలకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక చిత్రాలపై దృష్టి సారించినా? అవి ప్రేక్షకులను పూర్తిస్థాయిలో అలరించడంలో విఫలమయ్యాయి. ఒకప్పుడు వరుస హిట్లు అందుకున్న కాజల్ ఇప్పుడు సరైన సక్సెస్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అమ్మడి కెరీర్ గ్రాఫ్ గతంతో పోలిస్తే మందగించడానికి కథల ఎంపిక కూడా ప్రధాన కారణమని వాదనా లేకపోలేదు. అలాగే పాత్రల ఎంపికలో కాజల్ విధించుకున్న గ్లామర్ హద్దులు కూడా అవకాశాలను ప్రభావితం చేశాయన్నది ఇండస్ట్రీ వర్గాల మాట. గ్లామర్ పాత్రలకు పెట్టింది పేరుగా ఉన్న కాజల్ పెళ్లి తర్వాత ఆ హద్దులను మార్చుకోవడం వల్ల కొన్ని భారీ కమర్షియల్ ప్రాజెక్టులు చేజారి ఉండొచ్చు. ఇప్పటి తరం ప్రేక్షకులు , దర్శక నిర్మాతలు, కథ డిమాండ్‌కు తగ్గట్టుగా పాత్రలు ఉండాలని ఆశిస్తున్నారు. కాజల్ పాత ఇమేజ్‌కు భిన్నంగా వెళ్లడం వల్ల దర్శక నిర్మాతల ఆలోచనల్లో ఆమె స్థానం మారి ఉండొచ్చు. టాలీవుడ్‌లో మారుతోన్న ట్రెండ్స్ కూడా ఆమెకు సవాలుగా మారాయి.




## లైన్లో వరుస సినిమాలు

మమితాబైజు లైనప్ మామూలుగా లేదు. 'ప్రేమలు' సినిమాతో సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఈ అందాలభామ ఇప్పుడు అన్ని భాషల్నీ కవర్ చేస్తూ వరుసపెట్టి సినిమాలు చేస్తున్నది. అగ్రహీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి ఆమె నటించిన 'జననాయగన్' చిత్రం ఈ నెల 23న విడుదలకానున్న విషయం తెలిసిందే. ఇక సూర్యతో ఆమె నటించిన తెలుగు సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న విడుదల కానున్నట్టు తెలుస్తున్నది. దర్శకుడు వెంకీ అట్లూరి ఫ్యామిలీ, లవ్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక మలయాళంలో మమితా నటించిన 'బెత్లెహం కుటుంబ యూనిట్' ఆగస్ట్ 21న రిలీజ్ కానుంది.

## విలన్ పాత్రలో ఐశ్వర్య

ఐశ్వర్య రాజేశ్ కెరీర్‌లో మరో ఆసక్తికర మలుపు తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు నటిగా తన సహజ అభినయం, ఎమోషన్స్ కు ప్రాధాన్యమున్న పాత్రలు, స్ట్రాంగ్ క్యారెక్టరైజేషన్ ఉన్న క్యారెక్టర్లతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు పూర్తిగా భిన్నంగా కనిపించేందుకు రెడీ అవుతున్నట్టు సినీ వర్గాల్లో డిస్కషన్ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఐశ్వర్య ఓ స్టార్ హీరో సినిమాలో కథను మలుపుతిప్పే నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ లో నటించనున్నారనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. సాధారణంగా కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యం దక్కుతుంటుంది. అయితే ఇటీవలి కాలంలో చాలా మంది నటీమణులు స్క్రీన్ టైమ్ కంటే పాత్రకు ఉన్న బలం, కథపై దాని ప్రభావాన్ని ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఐశ్వర్య రాజేశ్ కూడా అదే దారిని ఎంచుకుంటున్నారని ఇండస్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.





## గౌతమ్ మీనన్‌కు సుప్రీంలో షాక్!

గౌతమ్ మీనన్ దర్శకత్వం వహించిన ప్రతిష్టాత్మక చిత్రం -నీతానే ఎన్ పొన్వసంతమ్- నిర్మాణ సమయం నుండి సాగుతున్న ఆర్థిక వివాదం తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో మరింత ముదిరింది. సుమారు 4.25 కోట్ల రూపాయల రుణాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాలంటూ గతంలో వచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడంతో దర్శకుడికి పెద్ద ఆర్థిక భారం ఎదురైంది. ఈ తీర్పు కోలీవుడ్ వర్గాల్లో చర్చనీయాశంగా మారింది. ఏళ్ల తరబడి సాగుతోన్న కేసులో గౌతమ్ మీనన్ వాదనలను న్యాయస్థానం తిరస్కరించింది. చిత్ర నిర్మాణ సమయంలో చేసుకున్న ఆర్థిక ఒప్పందాలు, పూచీకత్తులు , రుణాల చెల్లింపుల్లో జరిగిన జాప్యం పట్ల అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. గౌతమ్ మీనన్ సమర్పించిన ప్రతివాదనలు కోర్టును మెప్పించలేకపోవడంతో బాకీ మొత్తం భారీ వడ్డీతో కలిపి చెల్లించాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది.

## నెగటివిటీని భరించలేకపోతున్నా

తెలుగు, తమిళం, హిందీ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ రకుల్ ప్రీత్ సింగ్. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ భామ అప్పడప్పుడు నెటిజన్లు, అభిమానులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ గురించి మాట్లాడింది. సోషల్ మీడియా అనేది కొందరు జనాలు ముక్కు మొఖం తెలియని అకౌంట్లతో తరచూ కఠిన వ్యాఖ్యలు చేస్తూ నెగెటివిటీని ప్రచారం చేసే హబ్‌లాంటిది. చాలా మంది వ్యక్తులు అజ్ఞాత ప్రొఫైల్స్‌తో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. వారు చేస్తున్నకామెంట్ల ప్రభావం ఎలా ఉంటుందో కనీసం అర్థం చేసుకోరని చెప్పింది. అందరినీ మెప్పించడం అసాధ్యమన్న రకుల్ ప్రీత్ సింగ్ సెలబ్రిటీలు ఆన్‌లైన్‌లో వచ్చే అనవసరమైన ట్రోల్స్, విమర్శల వల్ల తమ ఫోకస్ మార్చుకోకూడదు. నెగెటివిటీని ఎదుర్కొనేందుకు వాటిని పట్టించుకోకుండా వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలపైన దృష్టి పెట్టడమే ఉత్తమ మార్గమనని చెప్పుకొచ్చింది. ఇండియన్ 2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ నటిస్తోన్న రామాయణలో కీలక పాత్రలో నటిస్తోంది. రకుల్ నటించిన పతీ పత్నీ ఔర్ వో దో ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఈ భామ నెక్ట్స్ ఇండియన్ 3 చేయాల్సి ఉంది. మరి తెలుగు సినిమాలో ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.



## హీరోయిన్‌ను ఆడిపోసుకుంటున్నారు!

సినిమా సక్సెస్ అనేది నటీనటుల పర్ఫామెన్స్ , కథ, విజువల్ ఎఫెక్ట్స్ వంటి పలు అంశాలపై ఆధారపడి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ఒక్కొక్కసారి సినిమాలో కథ లేకపోయినా, మ్యూజిక్ పరంగా కూడా మంచి విజయం అందుకున్న చిత్రాలు ఉన్నాయి. ఇంకొక వైపు హీరో తన భుజాల మీద సినిమాను మోసుకొస్తూ సక్సెస్ అందుకుంటే.. మరొకవైపు హీరోయిన్ కూడా సినిమా సక్సెస్ లో భాగమవుతుంది అనడంలో సందేహం లేదు. ఇక సినిమా సక్సెస్ అయ్యింది అంటే.. ఆ క్రెడిట్ మొత్తం హీరో లేదా ఆ చిత్ర దర్శకుడి ఖాతాలోకి వెళ్ళిపోతుంది. అదే సినిమా డిజాస్టర్ గా నిలిచింది అంటే మాత్రం హీరోయిన్ నటనపైనే విమర్శలు గుప్పిస్తారు. అంతేకాదు ఒక సినిమా డిజాస్టర్ అయ్యింది అంటే ఆ సినిమా హీరోయిన్ వల్లే డిజాస్టర్ అయ్యిందనే నిందలు కూడా ఇండస్ట్రీలో ఎప్పటినుంచో హీరోయిన్స్ మోస్తున్నారనే వాదన వినిపిస్తూనే ఉంది. ముఖ్యంగా రమ్యకృష్ణ, రోజా ఇలా నాటితరం హీరోయిన్లను మొదలుకొని.. ఆ తర్వాత తరం వచ్చిన శృతిహాసన్, పూజా హెగ్డే, ఇటీవల వచ్చిన శ్రీలీలా, కృతి శెట్టి లాంటి ఎంతోమంది హీరోయిన్స్ ఐరన్ లెగ్ అనే ముద్ర మోయాల్సి వచ్చింది. ముఖ్యంగా ఇండస్ట్రీలో హీరోయిన్ నటించిన సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతున్నాయి అంటే ఇక ఆ హీరోయిన్ పై ఐరన్ లెగ్ అనే ముద్ర వేస్తున్నారు. అయితే అదే సమయంలో హీరోలు వరుసగా డిజాస్టర్ లను మూటగట్టుకున్నా సరే వారిపై పడని ముద్ర.. హీరోయిన్లకే ఎందుకు అంటూ తనదైన శైలిలో ప్రశ్నించింది భాగ్యశ్రీ ఇకపోతే ఇటీవల లెనిన్ చిత్రంతో తన కెరియర్ లో ఎట్టకేలకు విజయాన్ని అందుకున్న ఈమె.. మునుపటి చిత్రాలన్నీ ఫ్లాప్ అవడంతో ఒకప్పుడు తెలుగు మీడియా కూడా ఈమె పై ఐరన్ లెగ్ అనే ముద్ర వేసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె.. ఐరన్ లెగ్ అనే ట్యాగ్ పై స్పందించింది. "ఐరన్ లెగ్ అనే ట్యాగ్ నాపై వేసినందుకు నేను ఏ రోజు కూడా బాధపడలేదు. కానీ దానికి అసలైన అర్థం తెలియకపోవడంతో ఏర్పడిన గందరగోళం నన్ను బాదించింది" అంటూ ఆమె చెప్పుకొచ్చింది.






# పోలీస్ అవతారంలో సిరాజ్

తెలంగాణ పోలీసు శాఖలో డీఎస్పీ హోదాలో ఉన్న టీమిండియా స్టార్ పేసర్, హైదరాబాదీ క్రికెటర్ మహ్మద్ సిరాజ్.. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం పోలీస్ హెడ్ క్వార్టర్‌కు పూర్తి పోలీస్ యూనిఫామ్‌తో విచ్చేసిన డీఎస్పీ సిరాజ్, సీవీ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీవీ ఆనంద్ తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సిరాజ్ ఆయనను కలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఖాకీ దుస్తుల్లో డీజీపీ ఆఫీస్‌కు వచ్చిన సిరాజ్‌ను చూసి అక్కడ ఉన్నవారు ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. ఈ భేటీ అనంతరం మహ్మద్ సిరాజ్ తన సోషల్ మీడియా ఖాతాలో డీజీపీతో దిగిన ఫొటోను పంచుకుంటూ ప్రత్యేక పోస్ట్ పెట్టారు. “తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సార్‌ను కలవడం చాలా సంతోషంగా ఉంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఆయన తన నూతన పదవీకాలాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రజలకు సేవ చేయడంలో ఆయన నిరంతరం విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను” అని సిరాజ్ పేర్కొన్నారు.

# విమర్శలు పట్టించుకోను



**ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో కోల్పోయినప్పటికీ, టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను గట్టిగా తిప్పికొట్టాడు. లార్డ్స్ వేదికగా జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో భారత్ 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.**

ఈ మ్యాచ్‌లో రోహిత్ చారిత్రక శతకం (138) సాధించినా, జట్టును గెలిపించలేకపోయాడు. మ్యాచ్ అనంతరం తన కెరీర్‌పై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, బయట జరిగే ప్రచారాన్ని తాను అస్సలు పట్టించుకోనని, జట్టు విజయానికి దోహదపడటమే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేశాడు. ఈ విషయంపై బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో రోహిత్ మాట్లాడుతూ.. “నా పని బ్యాట్‌తో దేశానికి, జట్టుకు ప్రాతినిధ్యం వహించడం.

నేను అరంగేట్రం చేసినప్పటి నుంచి ఇదే నాకు చెప్పబడింది, అదే నేను చేస్తున్నాను. నేను క్రికెట్‌లోకి వచ్చినప్పటి నుంచి బయట గోల ఉంది. నేను ఆడేంత వరకు ఇది ఇలాగే ఉంటుంది. కాబట్టి దాన్ని నేను పెద్దగా పట్టించుకోను. నేను మైదానంలో ఏం చేస్తున్నాననేదే ముఖ్యం. జట్టు విజయానికి నా వంతు కృషి చేయడానికే ప్రయత్నిస్తాను. ప్రస్తుతం నా దృష్టంతా దానిపైనే ఉంది. బయట గోల లేకపోతే అసలు మజానే ఉండదు. నా పని మైదానం లోపల, వారి పని బయట. నేను ఇలాగే చూస్తాను” అని తనదైన శైలిలో బదులిచ్చాడు.

**భారత బౌలింగ్ విభాగం గురించి మాట్లాడుతూ, బౌలర్లకు అంతర్జాతీయ వన్డే అనుభవం తక్కువగా ఉందని, వారికి కొంత సమయం ఇవ్వాలని కోరాడు. ఈ సిరీస్ ఓటమిని ఒక పాఠంగా తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు మెరుగ్గా రాణించాలని ఆశిస్తున్నట్లు తెలిపాడు.**

లార్డ్స్‌లో వన్డే శతకం సాధించిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించినప్పటికీ, జట్టు ఓటమి చెందడంతో తీవ్ర నిరాశకు గురైనట్లు రోహిత్ అంగీకరించాడు. “ఫలితం కొంచెం నిరాశపరిచింది. మేము మంచి క్రికెట్ ఆడుతున్నామని భావించాను. బర్మింగ్‌హామ్‌లో అద్భుతంగా ఆడాం. కార్డిఫ్‌లో బ్యాటింగ్‌లో వెనుకబడ్డాం. ఇక లార్డ్స్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. బ్యాటింగ్‌తో మేము చేయగలిగినదంతా ప్రయత్నించాం, కానీ 20-25 పరుగుల తేడాతో ఓడిపోయాం” అని విశ్లేషించాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీతో తన భాగస్వామ్యంపై కూడా రోహిత్ స్పందించాడు. ఈ జోడీ వన్డేల్లో 21వ శతాధిక భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. సచిన్-గంగూలీ (26) తర్వాత అత్యధిక సెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పిన భారత జోడీగా వీరు నిలిచారు. అలాగే, 400 అంతర్జాతీయ మ్యాచ్‌లు కలిసి ఆడిన తొలి భారత ద్వయంగా రికార్డు సృష్టించారు. కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడం ఎప్పుడూ ఆనందాన్ని ఇస్తుందని, ఒకరి ఆటను మరొకరం బాగా అర్థం చేసుకుంటామని రోహిత్ చెప్పాడు. చివరగా ఇంగ్లండ్‌లో ఆడటాన్ని తాను ఎంతగానో ఇష్టపడతానని రోహిత్ అన్నాడు. ఇక్కడి వాతావరణం, పిచ్‌లు ఆటగాడికి సవాలు విసురుతాయని, అప్పుడే ఆటగాడిగా ఎదుగుతామని పేర్కొన్నాడు. వ్యక్తిగత ప్రదర్శనల కంటే జట్టుగా సమష్టిగా రాణించడం చాలా అవసరమని, ఇకపై దానిపైనే దృష్టి సారిస్తామని రోహిత్ స్పష్టం చేశాడు.

# టెన్నిస్ క్రీడాకారిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు

మహిళా టెన్నిస్ సంఘం సంచలన నిర్ణయం తీసుకుంది. డబ్ల్యూటీఏ టూర్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారిణులందరికీ తప్పనిసరిగా జన్యుపరమైన లింగ నిర్ధారణ పరీక్షలు (జెనెటిక్ సెక్స్ టెస్టింగ్) ప్రవేశపెట్టింది. ఈ కొత్త నిబంధన మంగళవారం నుంచే అమల్లోకి



వస్తుందని సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, ప్లేయర్లు తమ బుగ్గ, రక్తం, లేదా లాలాజల నమూనాలను పరీక్ష కోసం ఇవ్వాలి. పురుష లక్షణాల అభివృద్ధికి కారణమయ్యే వై క్రోమోజోమ్‌లోని ఎస్ఆర్‌వై జన్యువు ఉనికిని గుర్తించడానికి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో నెగెటివ్ (జన్యువు లేదని) వచ్చిన వారే టోర్నమెంట్‌లలో ఆడేందుకు అర్హులు. పాజిటివ్ వచ్చిన వారికి తదుపరి వైద్య పరీక్షలు నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ టెస్టును క్రీడాకారిణి జీవితంలో ఒక్కసారి మాత్రమే చేయనున్నారు. పరీక్షను నిరాకరించిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కూడా డబ్ల్యూటీఏ హెచ్చరించింది. ట్రాన్స్‌జెండర్ మహిళలు గత రెండేళ్లుగా తమ టెస్టోస్టెరాన్ స్థాయిలను నిర్దిష్ట పరిమితిలోపు కొనసాగించినట్లయితే పోటీ పడటానికి అనుమతించే పాత విధానం స్థానంలో ఈ కొత్త రూల్ వచ్చింది. మహిళల టెన్నిస్‌లో సమాన అవకాశాలు, న్యాయమైన పోటీని నిర్ధారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు డబ్ల్యూటీఏ తెలిపింది. ఇది సున్నితమైన విషయమని, ఈ విధానాన్ని అమలు చేసేటప్పుడు క్రీడాకారులందరినీ గౌరవంగా చూసుకుంటామని పేర్కొంది. ఇప్పటికే వరల్డ్ అథ్లెటిక్స్ (2025 సెప్టెంబర్), వరల్డ్ బాక్సింగ్ (2025 మే) వంటి సంస్థలు కూడా మహిళా విభాగాల్లో పోటీపడే అథ్లెట్లకు ఇలాంటి జన్యు పరీక్షలను తప్పనిసరి చేశాయి.





# విధి మావైపే ఉంది: స్పానిష్ హీరో ఫెర్రాన్

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్ మహాసంగ్రామంలో అర్జెంటీనాను మట్టికరిపించి, స్పెయిన్‌ను విశ్వవిజేతగా నిలిపిన హీరో ఫెర్రాన్ టోర్రెస్ మ్యాచ్ అనంతరం సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆదివారం జరిగిన భీకర పోరులో 10 మందితో ఆడిన అర్జెంటీనాపై ఎక్స్‌ట్రా టైమ్‌లో తాను చేసిన మెరుపు గోల్‌పై స్పందిస్తూ.. ఈ ప్రపంచకప్‌ను స్పెయిన్ గెలవాలని 'విధి' ముందే రాసి పెట్టి ఉందని వ్యాఖ్యానించాడు. మ్యాచ్ 62వ నిమిషంలో మైఖేల్ ఓయర్జబల్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చిన టోర్రెస్.. 106వ నిమిషంలో నికో విలియమ్స్ అందించిన బంతిని గోల్‌గా మలిచి స్పెయిన్‌కు రెండో ప్రపంచకప్ టైటిల్‌ను అందించాడు. మ్యాచ్ అనంతరం బార్సిలోనా ఫార్వర్డ్ అయిన టోర్రెస్ మాట్లాడుతూ.. “ఫైనల్ మ్యాచ్‌లు ఎప్పుడూ కఠినంగానే ఉంటాయి. ముఖ్యంగా ప్రత్యర్థి జట్టులో లియోనెల్ మెస్సీ లాంటి ఆటగాడు ఉన్నప్పుడు కచ్చితంగా ఆందోళన ఉంటుంది. కానీ మా ఆటపై మాకు ఎప్పుడూ నమ్మకం ఉంది. మా సొంత ఫుట్‌బాల్‌ను ప్రపంచానికి చూపించాలనుకున్నాం, అదే చేసి చూపించాం” అని గర్వంగా చెప్పాడు. ఈ టోర్నీలో ఆదివారం నాటి మ్యాచ్‌కు ముందు వరకు టోర్రెస్ ఒక్క గోల్ కూడా చేయలేదు.



# రాజ్ కుంద్రాకు ఎదురుదెబ్బ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ యాజమాన్య హక్కుల వివాదంలో ప్రముఖ వ్యాపారవేత్త, నటి శిల్పాశెట్టి భర్త రాజ్ కుంద్రాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎమర్జింగ్ మీడియా వెంచర్స్ (ఈఎంవీ) సంస్థకు ఆయన 4.94 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 41 కోట్లు) తిరిగి చెల్లించాలని ఇంగ్లండ్ అండ్ వేల్స్ హైకోర్టు సోమవారం తీర్పునిచ్చింది. ఈ వివాదంపై భారత్‌లో ఎటువంటి న్యాయపరమైన చర్యలు చేపట్టకుండా ఆయనపై శాశ్వత నిషేధం (యాంటీ-సూట్ ఇంజంక్షన్) విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గతంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో రాజ్ కుంద్రాకు చెందిన కుకీ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ ద్వారా పరోక్షంగా 11.7 శాతం వాటా ఉండేది. 2015లో ఐపీఎల్ బెట్టింగ్ కుంభకోణంలో ఆయన ప్రమేయం ఉన్నట్లు తేలడంతో ఫ్రాంచైజీపై రెండేళ్ల నిషేధం విధించారు. ఆ సమయంలోనే కుంద్రా తన వాటాలను బదిలీ చేశారు.



# అర్జెంటీనా ప్రవర్తన సిగ్గుచేటు!

**ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. నిన్న న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. అయితే, మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు ఫుట్‌బాల్ ప్రపంచంలో పెద్ద దుమారం రేపాయి.**



అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానుల ప్రవర్తన సంస్కారహీనంగా ఉందని, క్రీడాస్ఫూర్తికి మాయని మచ్చ తెచ్చిందని పలువురు విశ్లేషకులు మండిపడుతున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత రన్నరప్ పతకాలు అందుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు, కొత్త ఛాంపియన్లను అభినందించకుండా మైదానం నుంచి వెళ్లిపోయారు. స్పెయిన్ జట్టు ట్రోఫీని స్వీకరించేందుకు సిద్ధమవుతుండగా, లియోనెల్ మెస్సీ సహా అర్జెంటీనా ఆటగాళ్లందరూ మైదానంలో మరోవైపుకు వెళ్లి వీపు చూపిస్తూ నిలబడ్డారు. అంతకుముందు అర్జెంటీనా పతకాలు అందుకుంటున్నప్పుడు స్పెయిన్ ఆటగాళ్లు చప్పట్లతో అభినందనలు తెలిపినా, అర్జెంటీనా మాత్రం ఆ గౌరవాన్ని తిరిగి ఇవ్వలేదు. ఇది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇక, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ రోడ్రి 'గోల్డెన్ బాల్' అవార్డు అందుకుంటున్నప్పుడు స్టేడియంలోని అర్జెంటీనా అభిమానులు 'మెస్సీ, మెస్సీ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ పరిణామం అక్కడి వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఈ ఘటనలపై +శ్రీశ్రీ.ఎశీఎ కథనం ప్రకారం.. టాక్‌స్పోర్ట్ బ్రాడ్‌కాస్టర్ అడ్రియన్ డర్హామ్ తీవ్రంగా స్పందించారు. “వారిలో కనీస సంస్కారం లేదు. ఈ రోజు వారు సిగ్గుపడే రీతిలో ప్రవర్తించారు. ఫైనల్లో ఓటమిని వారు అంగీకరించలేకపోతున్నారు. అర్జెంటీనా జట్టు ఈ ఆటకు, ప్రపంచకప్‌కు పూర్తి అవమానం” అని ఆయన ఘాటుగా విమర్శించారు. “ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత సులువైన గ్రూప్‌లో డ్రా పొంది, నాకౌట్ దశలో కష్టపడి గెలిచి, ఇక్కడికొచ్చి తమను తాము అవమానించుకున్నారు” అని డర్హామ్ వ్యాఖ్యానించారు. టోర్నీ ఆద్యంతం అర్జెంటీనాకు అనుకూలంగా అనేక నిర్ణయాలు వచ్చాయని ఆయన ఆరోపించారు. నిజానికి ఫైనల్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లలో అసహనం కట్టలు తెంచుకుంది. దాంతో స్పెయిన్ ఆటగాళ్లపై దురుసుగా ప్రవర్తించారు. స్పెయిన్ ఆటగాళ్లతో గొడవకు దిగినందుకు లియాండ్రో పరేడెస్‌కు రెడ్ కార్డ్ చూపించారు. అంతకుముందు ఆట అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ కూడా రెండో ఎల్లో కార్డ్‌తో మైదానం వీడాడు. దీంతో ప్రపంచకప్ ఫైనల్లో రెడ్ కార్డ్ పొందిన ఆరో ఆటగాడిగా నిలిచాడు. ఈ విజయంతో స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడమే కాకుండా వరుసగా 38 మ్యాచ్‌లలో అపజయం ఎరుగని యూరోపియన్ జట్టుగా రికార్డు సృష్టించింది. అయితే, స్పెయిన్ చారిత్రక విజయం కంటే అర్జెంటీనా వివాదాస్పద ప్రవర్తనే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది.

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# నీళ్లు.. సవాళ్లు

"జలమే జీవం" అనే మాట ఇప్పుడు నినాదంగా కాదు, మనుగడకు సంబంధించిన హెచ్చరికగా మారుతోంది. రాబోయే దశాబ్దంలో ప్రపంచాన్ని వేధించబోయే అత్యంత తీవ్రమైన సమస్య ఏదైనా ఉందంటే అది నీటి సంక్షోభమే. ఒకప్పుడు కరువు ప్రాంతాలకే పరిమితమైన ఈ సమస్య నేడు మహానగరాల నుంచి గ్రామాల వరకు విస్తరించింది. జనాభా పెరుగుదల, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల అధిక వినియోగం, కాలుష్యం, నిర్లక్ష్యమైన నీటి నిర్వహణ కలిసి ప్రపంచాన్ని జల సంక్షోభం అంచుకు తీసుకెళ్తున్నాయి. భారత్ ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం. అయితే ప్రపంచ మంచినీటి వనరుల్లో మన వాటా కేవలం నాలుగు శాతం మాత్రమే. ఈ పరిమిత వనరులతోనే దేశ అవసరాలను తీర్చుకోవాల్సి వస్తోంది. మరోవైపు పట్టణీకరణ వేగంగా పెరుగుతుండటం, పరిశ్రమల విస్తరణ, వ్యవసాయంలో అధిక నీటి వినియోగం వల్ల నీటిపై ఒత్తిడి మరింత తీవ్రమవుతోంది. భూగర్భ జలాలను విచక్షణారహితంగా తోడేయడం వల్ల అనేక ప్రాంతాల్లో నీటి మట్టం ఏటా తగ్గిపోతోంది. తెలుగు రాష్ట్రాల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. తెలంగాణలో చెరువుల పునరుద్ధరణ, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలు చేపట్టినా భూగర్భ జలాలపై ఆధారపడటం తగ్గలేదు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, సాగునీటి అసమాన పంపిణీ ఇంకా సవాలుగానే ఉంది. నగరాల్లో అయితే బోర్‌వెల్లు ఎండిపోవడం, ట్యాంకర్లపై ఆధారపడడం సాధారణ దృశ్యంగా మారింది. వాతావరణ మార్పులు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. వర్షాలు సమయానికి పడకపోవడం, ఒక్కసారిగా అతివృష్టి కురవడం, మిగతా కాలం ఎండలు మండిపోవడం వల్ల నీటి నిల్వలు సమర్థంగా జరగడం లేదు. ఒకవైపు వరదలు, మరోవైపు కరువులు.. ఇవి రెండూ నీటి నిర్వహణలో ఉన్న లోపాలను బయటపెడుతున్నాయి. ప్రతి వర్షపు చుక్కను నిల్వ చేయడంలో విఫలమవుతున్నాం. వ్యవసాయ రంగంలో కూడా నీటి వినియోగంపై పునరాలోచన అవసరం. నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటలను ప్రతి ప్రాంతంలో సాగు చేయడం శాశ్వత పరిష్కారం కాదు. సూక్ష్మ సేద్యం, డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలు, పంటల వైవిధ్యీకరణ, నీటి సామర్థ్యాన్ని పెంచే సాంకేతికతలను విస్తృతంగా అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. రైతులకు నీటి వినియోగంపై అవగాహన పెంచడం కూడా అంతే ముఖ్యం. పట్టణాల్లో వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి చేయాలి. ప్రతి ఇంటిలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఉండేలా కఠిన నిబంధనలు అమలు చేయాలి. చెరువులు, కుంటలు, కాలువలను ఆక్రమణల నుంచి కాపాడాలి. శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమలు, ఉద్యానవనాలు, నిర్మాణ రంగంలో తిరిగి వినియోగించే విధానాలను ప్రోత్సహించాలి. నీటిని ఒకసారి ఉపయోగించి వదిలేయడం అనే పద్ధతికి ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. నీటి సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడి కర్తవ్యమూ. ఇంట్లో చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం, వర్షపు నీటిని నిల్వ చేయడం, అవసరానికి మించి నీటిని వృథా చేయకపోవడం వంటి అలవాట్లు సమాజంలో పెద్ద మార్పుకు దారి తీస్తాయి. నీటి విలువను పిల్లలకు చిన్నప్పటి నుంచే బోధించాల్సిన అవసరం ఉంది. రాబోయే దశాబ్దంలో యుద్ధాలు చమురు కోసం కాకుండా నీటి కోసం జరుగుతాయనే హెచ్చరికలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. అది నిజం కాకుండా ఉండాలంటే ఇప్పుడే చర్యలు ప్రారంభించాలి. నీటిని ప్రకృతి ప్రసాదంగా కాకుండా పరిమితమైన జాతీయ సంపదగా భావించి వినియోగించాలి. అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు కాదు; భావితరాలకు తాగునీటిని అందించే సామర్థ్యాన్ని నిర్మించడమూ అదే స్థాయిలో ముఖ్యమైనది. నీటిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం. ప్రతి చుక్కను ఆదా చేయడం అంటే రేపటి తరాల జీవన హక్కును కాపాడినట్టే.

# ప్రకృతి ఆరాధనే బోనాలు



ఆషాఢం అడుగుపెట్టిందంటే తెలంగాణ నేల మరోసారి భక్తి పరవశంలో మునిగిపోతుంది. పల్లె నుంచి పట్టణం వరకు "జై మహంకాళి... జై ఎల్లమ్మ..." అంటూ మారుమోగే నినాదాలు, డప్పుల మోతలు, పోతరాజుల విన్యాసాలు, అమ్మవారి ఘటాల ఊరేగింపులు తెలంగాణ సంస్కృతికి అద్దం పడతాయి. అయితే బోనాలు కేవలం ఒక మతపరమైన ఉత్సవం కాదు. అది ప్రకృతిని ఆరాధించే జీవన తత్వం. భూమిని తల్లిగా, వానను వరంగా, పంటను ప్రాణంగా భావించిన తెలంగాణ సమాజం ప్రకృతికి అర్పించే కృతజ్ఞతా నివాళే బోనాలు. తెలంగాణలో పెద్దలు ఒక మాట చెబుతారు... "వాన పడితేనే వాగు నవ్వుతుంది... వాగు నవ్వితేనే ఊరు నవ్వుతుంది." ఈ ఒక్క మాటలోనే బోనాల అసలు సారాంశం దాగి ఉంది. వర్షాలు సమృద్ధిగా కురవాలి, చెరువులు నిండాలి, పొలాలు పచ్చగా కళకళలాడాలి, పశు సంపద వృద్ధి చెందాలి, ప్రజలు ఆరోగ్యంగా జీవించాలి అనే ఆకాంక్షతో అమ్మవారికి బోనం సమర్పించడం తెలంగాణ ప్రజల విశ్వాసం. ప్రకృతి అనుగ్రహిస్తేనే జీవితం సాఫీగా సాగుతుందనే సత్యాన్ని ఈ పండుగ తరతరాలకు గుర్తు చేస్తోంది. బోనాల వెనుక చరిత్ర కూడా అంతే గొప్పది. కలరా వంటి మహమ్మారులు ప్రజలను అతలాకుతలం చేసిన రోజుల్లో "తల్లీ... మా ఊరిని కాపాడు" అని గ్రామదేవతలను వేడుకున్న ప్రజల మొక్కుబడే బోనాల ఆచారానికి మూలం. అనంతరం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం, లాల్‌దర్వాజ మహంకాళి ఆలయం వంటి క్షేత్రాల ద్వారా ఈ ఉత్సవం తెలంగాణ అంతటా విస్తరించింది. 1908 మూసీ వరదల వంటి విపత్తుల సమయంలో కూడా ప్రజలు అమ్మవారిని ఆశ్రయించి మొక్కులు తీర్చుకోవడం ఈ పండుగకు ప్రజల జీవితాల్లో ఉన్న స్థానాన్ని తెలియజేస్తుంది. బోనాలను కేవలం భక్తి కోణంలో మాత్రమే చూడడం సరైంది కాదు. ఇందులో ప్రకృతి శాస్త్రం ఉంది, వ్యవసాయ తత్వం ఉంది, ఆరోగ్య సందేశం ఉంది, సామాజిక ఐక్యత ఉంది. ఆషాఢం వర్షాకాల ప్రారంభం. ఈ కాలంలో అంటువ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంటుంది. గతంలో వైద్య సదుపాయాలు పరిమితంగా ఉన్న రోజుల్లో ప్రజలు ఊరంతా కలిసి దేవాలయాల్లో ప్రార్థనలు నిర్వహించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పరస్పరం సహకరించుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేసేవారు. అందుకే బోనాలు భక్తి మాత్రమే కాదు, సామాజిక బాధ్యతకు కూడా ప్రతీక.

బోనంలో సమర్పించే ప్రతి వస్తువూ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. మట్టి కుండ, బియ్యం, పాలు, పెరుగు, బెల్లం, పసుపు, కుంకుమ, వేపాకులు... ఇవన్నీ భూమి ప్రసాదించిన వరాలే. రైతు చెమటతో పండిన ధాన్యాన్ని అమ్మవారికి సమర్పించడం అంటే ప్రకృతికి కృతజ్ఞత తెలియజేయడమే. "నువ్వు ఇచ్చిన వరాన్ని మళ్లీ నీకే అర్పిస్తున్నాం" అనే వినమ్ర భావన ఈ ఆచారంలో ప్రతిఫలిస్తుంది. తెలంగాణ సంస్కృతిలో అమ్మవారు అంటే కేవలం ఆరాధ్య దేవత కాదు. ఊరిని కాపాడే శక్తి. అందుకే ప్రతి గ్రామానికీ ఒక గ్రామదేవత ఉంటుంది. "అమ్మ దయ ఉంటే అన్నం దొరుకుతుంది", "భూమి నవ్వితే రైతు బతుకుతాడు" అని పెద్దలు చెప్పే మాటల వెనుక ప్రకృతిపట్ల ఉన్న అపారమైన గౌరవం దాగి ఉంది. ప్రకృతి అనుకూలిస్తేనే పంట పుడుతుంది. పంట పుడితేనే సమాజం సుభిక్షంగా ఉంటుంది. ఈ జీవన సత్యాన్ని మన పూర్వీకులు బోనాల వంటి సంప్రదాయాల ద్వారా తరతరాలకు అందించారు. బోనాల జాతరలో కనిపించే పోతరాజు విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, ఘటాల ఊరేగింపులు, తొట్టెల సమర్పణ, డప్పుల మోతలు తెలంగాణ జానపద సంస్కృతికి జీవం పోస్తాయి. ఈ ఉత్సవాల్లో కులమత భేదాలకు అతీతంగా ప్రజలంతా ఒకే కుటుంబంలా పాల్గొనడం బోనాల గొప్పతనం. అందుకే ఈ పండుగ తెలంగాణ సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. అయితే నేటి పరిస్థితులు మారాయి. వాతావరణ మార్పులు ప్రపంచాన్నే ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకవైపు తీవ్రమైన ఎండలు, మరోవైపు అతివృష్టి, తగ్గిపోతున్న అడవులు, పూడిపోతున్న చెరువులు, క్షీణిస్తున్న భూగర్భ జలాలు... ఇవన్నీ ప్రకృతి సమతుల్యతకు తీవ్రమైన ముప్పుగా మారాయి. ఇలాంటి సమయంలో బోనాల అసలు సందేశాన్ని మళ్లీ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అమ్మవారిని పూజించడం ఎంత ముఖ్యమో, ఆమె సృష్టించిన ప్రకృతిని కాపాడటం అంతకంటే ముఖ్యమనే విషయాన్ని మనం గ్రహించాలి. "చెట్టు ఉంటేనే నీడ... చెరువు ఉంటేనే జీవం" అనే తెలంగాణ జీవన తత్వం నేటి తరానికి మార్గదర్శకంగా ఉండాలి. ప్రతి బోనాల సందర్భంగా ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటాలి. ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత ఉత్సవాలను నిర్వహించాలి. దేవాలయాల అభివృద్ధితో పాటు చెరువులు, కుంటలు, వాగులు, పచ్చదనాన్ని సంరక్షించేందుకు కూడా సమాజం కృషి చేయాలి. అదే అమ్మవారికి సమర్పించే నిజమైన బోనం.

ప్రభుత్వం బోనాల నిర్వహణకు నిధులు కేటాయించడం అభినందనీయం. అయితే ఉత్సవాల వైభవంతో పాటు భక్తుల భద్రత, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై కూడా సమాన దృష్టి అవసరం. ఆలయాల వద్ద పచ్చదనాన్ని పెంపొందించడం, వర్షపు నీటి సంరక్షణకు చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలు బోనాల స్ఫూర్తికి మరింత దగ్గరగా ఉంటాయి. నేటి యువత కూడా బోనాలను కేవలం ఒక ఉత్సవంగా కాకుండా, ప్రకృతి, సంస్కృతి, సామాజిక బాధ్యతలను కలిపిన జీవన తత్వంగా అర్థం చేసుకోవాలి. బోనం అంటే కేవలం కుండ కాదు; అది కృతజ్ఞత. పసుపు అంటే కేవలం అలంకారం కాదు; ఆరోగ్యానికి ప్రతీక. వేపాకులు కేవలం ఆచారం కాదు; ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి చిహ్నం. ఈ భావాన్ని అర్థం చేసుకున్నప్పుడే బోనాల అసలు మహిమ తెలుస్తుంది. ప్రకృతిని గౌరవించడం అంటే దేవుడిని గౌరవించినట్టే. భూమిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడినట్టే. బోనాలు మనకు ఇదే శాశ్వత సందేశాన్ని అందిస్తున్నాయి. అమ్మవారికి సమర్పించే ప్రతి బోనం ప్రకృతిపట్ల కృతజ్ఞతకు ప్రతీక కావాలి. ప్రతి భక్తుడు ఒక మొక్కను నాటాలి. ప్రతి ఆలయం పర్యావరణ పరిరక్షణకు కేంద్రంగా మారాలి. భక్తి ప్రకృతిని కలిసినప్పుడే ఆ ఆరాధనకు సంపూర్ణత వస్తుంది. అందుకే బోనాలు కేవలం ఒక పండుగ కాదు. అది తెలంగాణ సంస్కృతికి శాశ్వత చిరునామా. ప్రకృతితో మనిషి అనుబంధానికి సజీవ సాక్ష్యం. సమిష్టి జీవనానికి ప్రతీక. భవిష్యత్ తరాలకు అందించాల్సిన గొప్ప వారసత్వం. భక్తి, ప్రకృతి, సంస్కృతి కలిసిన చోటే తెలంగాణ ఆత్మ ఉంటుంది. ప్రకృతి ఆరాధనే బోనాలు.. అదే తెలంగాణ జీవన తత్వం.



శ్రీశైలం దూడం, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9133947176

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికలలో పోటీ చేసే సంస్థలు మాత్రమే కావు. అవి ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వ విధానాలుగా మార్చే కీలక వేదికలు. దేశ రాజకీయ వ్యవస్థకు స్థిరత్వాన్ని, ప్రజాస్వామ్యానికి బలాన్ని, ప్రభుత్వాలకు బాధ్యతను కల్పించే ప్రధాన సంస్థలే రాజకీయ పార్టీలు. అయితే నేడు ప్రపంచంలోని అనేక ప్రజాస్వామ్య దేశాలలో మాదిరిగానే భారతదేశంలో కూడా రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం బలహీనపడడం, క్రమశిక్షణ రాహిత్యం పెరగడం, నాయకత్వ పోటీలు తీవ్రరూపం దాల్చడం, వర్గపోరాటాలు అధికమవడం, వ్యక్తిగత ప్రయోజనాలు పార్టీ సిద్ధాంతాలపై పైచేయి సాధించడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు దేశవ్యాప్తంగా బలమైన సంస్థాగత నిర్మాణం, సిద్ధాంతపరమైన కట్టుబాట్లు, కార్యకర్తల ఆధారిత రాజకీయాలతో ముందుకు సాగిన అనేక జాతీయ పార్టీలు కూడా నేడు అంతర్గత విభేదాల కారణంగా తమ రాజకీయ ప్రభావాన్ని కోల్పోతున్నాయి.

# రాజకీయ పార్టీల్లో అనైక్యత




డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

భారతదేశంలో స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన రాజకీయ సంస్కృతిలో సిద్ధాంతాలకు అత్యంత ప్రాధాన్యం ఉండేది. పార్టీలలో అంతర్గత చర్చలు, సమావేశాలు, ఎన్నికలు, విధానాలపై విస్తృత స్థాయిలో చర్చించే సంప్రదాయం ఉండేది. కాలక్రమేణా రాజకీయాల్లో వ్యక్తి ఆధిపత్యం పెరగడం, కుటుంబ రాజకీయాలు విస్తరించడం, అధికారం కేంద్రీకరణ, ఆర్థిక ప్రయోజనాలు రాజకీయాల్లో ప్రభావం చూపడం వల్ల పార్టీ సంస్థలు బలహీనపడ్డాయి. నేడు అనేక పార్టీలలో నిర్ణయాలు కొద్దిమంది నాయకుల చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయి. దీనివల్ల మధ్యస్థాయి నాయకులు, కార్యకర్తలు అసంతృప్తికి గురవుతున్నారు. ఈ అసంతృప్తి క్రమంగా వర్గపోరాటాలకు, తిరుగుబాట్లకు, పార్టీ మార్పులకు దారితీస్తోంది. ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలో పార్టీల బలం వారి సిద్ధాంతాలలో మాత్రమే కాదు, అంతర్గత ప్రజాస్వామ్యంలో కూడా ఉంటుంది. ఒక పార్టీ తన సభ్యులకు అభిప్రాయ స్వేచ్ఛను కల్పించలేకపోతే, నాయకత్వ మార్పును పారదర్శకంగా నిర్వహించలేకపోతే, స్థానిక నాయకత్వానికి అవకాశాలు ఇవ్వలేకపోతే, ఆ పార్టీ క్రమంగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, నేడు అనేక రాజకీయ పార్టీలలో కనిపిస్తున్న సంక్షోభానికి ప్రధాన కారణం నాయకత్వ వికేంద్రీకరణ లేకపోవడమే.

పార్టీలలో క్రమశిక్షణ రాహిత్యం పెరగడానికి మరో ప్రధాన కారణం రాజకీయ అవకాశవాదం. ఒకప్పుడు సిద్ధాంతాల ఆధారంగా పార్టీలు మారడం అరుదుగా ఉండేది. ఇప్పుడు అధికార అవకాశాలు, పదవులు, టికెట్లు, ఆర్థిక ప్రయోజనాల కోసం నాయకులు పార్టీలు మారడం సాధారణమైంది. ప్రజాప్రతినిధులు ఎన్నికల అనంతరం పార్టీ మారడం వల్ల ప్రజల తీర్పు కూడా కొన్నిసార్లు నిర్వీర్యమవుతోంది. పార్టీ పట్ల నిబద్ధత తగ్గి, వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తు ప్రధాన లక్ష్యంగా మారుతోంది. రాజకీయ పార్టీలలో యువ నాయకత్వానికి తగిన ప్రాధాన్యం లేకపోవడం కూడా అంతర్గత అసంతృప్తికి కారణమవుతోంది. యువతకు అవకాశాలు కల్పించకుండా, ఒకే నాయకత్వం దశాబ్దాల పాటు కొనసాగడం వల్ల కొత్త ఆలోచనలు, కొత్త నాయకత్వం ఎదగడానికి అవకాశాలు తగ్గుతున్నాయి. అదే సమయంలో సీనియర్ నాయకుల మధ్య ఆధిపత్య పోటీలు పార్టీని బలహీనపరుస్తున్నాయి. సామాజిక మాధ్యమాల విస్తరణతో అంతర్గత విభేదాలు మరింత బహిర్గతమవుతున్నాయి. ఒకప్పుడు పార్టీ సమావేశాల్లోనే పరిమితమయ్యే అసమ్మతి ఇప్పుడు ప్రజల ముందే సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తమవుతోంది. నాయకులు ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేయడం, పార్టీ నిర్ణయాలను సోషల్ మీడియా ద్వారా వ్యతిరేకించడం, మీడియా వేదికలపై ఆరోపణలు చేయడం వల్ల పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. ప్రజలలో ఆ పార్టీపై విశ్వాసం తగ్గుతోంది.

భారతదేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే అనేక జాతీయ, ప్రాంతీయ పార్టీలలో అంతర్గత విభేదాల కారణంగా చీలికలు చోటుచేసుకున్నాయి. కొన్ని పార్టీలు పూర్తిగా విచ్ఛిన్నమయ్యాయి. మరికొన్ని పార్టీలు తమ ప్రభావాన్ని కోల్పోయాయి. సిద్ధాంతాల కంటే వ్యక్తుల చుట్టూ రాజకీయాలు తిరగడం వల్ల పార్టీలు సంస్థాగతంగా బలహీనపడ్డాయి. వ్యక్తి ఆధారిత రాజకీయ వ్యవస్థలో నాయకుడు బలహీనపడితే పార్టీ కూడా బలహీనపడే పరిస్థితి ఏర్పడుతోంది. అంతర్గత ప్రజాస్వామ్యం లేని రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యాన్ని సమర్థవంతంగా పరిరక్షించలేవని అనేక రాజకీయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడి ఎన్నికలు, కార్యవర్గాల ఏర్పాటు, అభ్యర్థుల ఎంపిక, విధాన నిర్ణయాలలో సభ్యుల భాగస్వామ్యం, ఆర్థిక వ్యవహారాలలో పారదర్శకత వంటి అంశాలు బలోపేతం కావాలి. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విలువలను ముందుగా తమ సంస్థలలో అమలు చేసినప్పుడే దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడుతుంది. ఎన్నికల సమయంలో మాత్రమే కార్యకర్తలను గుర్తించే సంస్కృతి కూడా అనైక్యతకు కారణమవుతోంది. ఎన్నికలు ముగిసిన తరువాత కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం తగ్గిపోవడం, స్థానిక నాయకులను సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల అసంతృప్తి పెరుగుతోంది. అనేక సందర్భాలలో టికెట్ పంపిణీ విధానం కూడా తీవ్ర విభేదాలకు కారణమవుతోంది. సుదీర్ఘకాలంగా పనిచేసిన నాయకులను పక్కనపెట్టి కొత్తవారికి లేదా ప్రభావశీలులకు అవకాశాలు ఇవ్వడం వల్ల పార్టీ నిర్మాణం దెబ్బతింటోంది. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ



పార్టీలు తరచుగా అంతర్గత ఎన్నికలు నిర్వహించడం, నాయకత్వానికి కాలపరిమితులు విధించడం, సభ్యుల అభిప్రాయాలను డిజిటల్ వేదికల ద్వారా సేకరించడం, విధాన నిర్ణయాలలో భాగస్వామ్యాన్ని పెంచడం వంటి చర్యల ద్వారా సంస్థాగత బలాన్ని పెంపొందిస్తున్నాయి. భారతదేశంలో కూడా ఈ తరహా సంస్కరణల అవసరం రోజురోజుకూ పెరుగుతోంది.

రాజకీయ పార్టీలలో పెరుగుతున్న అనైక్యత ప్రభావం కేవలం ఆ పార్టీలకే పరిమితం కాదు. ప్రభుత్వ స్థిరత్వం, విధానాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులు, పరిపాలన, ప్రజల విశ్వాసం వంటి అనేక రంగాలపై దీని ప్రభావం పడుతుంది. తరచూ నాయకత్వ మార్పులు, తిరుగుబాట్లు, ప్రభుత్వాల పతనం వంటి పరిణామాలు దేశ రాజకీయ స్థిరత్వాన్ని బలహీనపరుస్తాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం కూడా అవసరం. అయితే ప్రతిపక్ష పార్టీలు అంతర్గత విభేదాలతో బలహీనపడితే అధికార పక్షంపై సమర్థవంతమైన ప్రజాస్వామ్య పర్యవేక్షణ తగ్గిపోతుంది. భవిష్యత్తులో రాజకీయ పార్టీలు తమ సంస్థాగత నిర్మాణాన్ని పునరుద్ధరించుకోవాలి. సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నాయకత్వ మార్పును ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలి. కార్యకర్తలకు గౌరవం, యువతకు అవకాశాలు, మహిళలకు ప్రాతినిధ్యం, ఆర్థిక పారదర్శకత, అంతర్గత ఎన్నికలు, బాధ్యతాయుతమైన నాయకత్వం, క్రమశిక్షణతో కూడిన సంస్థాగత వ్యవస్థను నెలకొల్పాలి. అప్పుడు మాత్రమే రాజకీయ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందగలవు. ప్రజాస్వామ్యం బలపడాలంటే కేవలం ఎన్నికలు జరగడం సరిపోదు. ఎన్నికలలో పాల్గొనే రాజకీయ పార్టీలు కూడా ప్రజాస్వామ్య విలువలను తమ అంతర్గత వ్యవస్థలో ఆచరించాలి. రాజకీయ పార్టీలు దేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముక అయితే, అంతర్గత ప్రజాస్వామ్యం ఆ వెన్నెముకకు బలం. అనైక్యత, వ్యక్తివాదం, క్రమశిక్షణ రాహిత్యం, అవకాశవాద రాజకీయాలు కొనసాగితే ప్రజాస్వామ్య వ్యవస్థ నాణ్యత క్షీణించే ప్రమాదం ఉంది. కాబట్టి రాజకీయ పార్టీలు ఆత్మపరిశీలన చేసుకొని, సంస్థాగత సంస్కరణలు చేపట్టి, ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడం నేటి భారత ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరమైన కర్తవ్యంగా నిలుస్తోంది.

రాజకీయ పార్టీలలో పెరుగుతున్న అనైక్యతకు ఎన్నికల రాజకీయాల స్వరూపంలో వచ్చిన మార్పులు కూడా ఒక ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు పార్టీలు సిద్ధాంతాలు, ప్రజా ఉద్యమాలు, సామాజిక మార్పు, ప్రజాసేవ వంటి లక్ష్యాలతో ముందుకు సాగేవి. ప్రస్తుతం ఎన్నికల విజయమే ప్రధాన లక్ష్యంగా మారడంతో సిద్ధాంతాల కంటే గెలుపు అవకాశాలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ఫలితంగా ఒకే పార్టీకి చెందిన నాయకుల మధ్య పోటీ సహజ రాజకీయ పోటీగా కాకుండా వ్యక్తిగత ఆధిపత్య పోరాటంగా మారుతోంది. ఈ పరిస్థితి పార్టీ ఐక్యతను బలహీనపరుస్తోంది. ప్రస్తుతం రాజకీయాలలో ఆర్థిక వనరుల ప్రాధాన్యం గణనీయంగా పెరిగింది. ఎన్నికల వ్యయం కోట్ల రూపాయలకు చేరుకోవడం, ప్రచారంలో డిజిటల్ సాంకేతికత, సామాజిక మాధ్యమాలు, భారీ సభలు, ప్రచార బృందాలు కీలకంగా మారడం వల్ల ఆర్థికంగా బలమైన నాయకుల ప్రభావం పార్టీల్లో పెరుగుతోంది. ఫలితంగా దీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు, సిద్ధాంత నిబద్ధత కలిగిన నాయకులు పక్కకు నెట్టబడుతున్నారనే భావన ఏర్పడుతోంది. ఈ అసంతృప్తి క్రమంగా అంతర్గత తిరుగుబాట్లకు దారితీస్తోంది. భారత రాజకీయాలలో కుటుంబ రాజకీయాల విస్తరణ కూడా అంతర్గత ప్రజాస్వామ్యానికి సవాలుగా మారింది. కొన్ని పార్టీలలో నాయకత్వం ఒకే కుటుంబానికి పరిమితమవడం, కీలక పదవులు వారసత్వంగా మారడం వల్ల ప్రతిభావంతులైన నాయకులకు అవకాశాలు తగ్గుతున్నాయి. రాజకీయ పార్టీలు తమలో తాము ప్రజాస్వామ్యాన్ని ఆచరిస్తేనే దేశ ప్రజాస్వామ్యం మరింత పరిపక్వంగా, సమగ్రంగా, ప్రజాకేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. అందువల్ల నేటి అవసరం అధికార పోటీ కాదు.. ప్రజాస్వామ్య పునర్నిర్మాణం. వ్యక్తుల విజయం కాదు.. సంస్థల బలోపేతం. వర్గాల ఆధిపత్యం కాదు.. విలువల ఆధారిత రాజకీయ సంస్కృతి. అప్పుడు మాత్రమే భారత ప్రజాస్వామ్యం రానున్న తరాలకు ఆదర్శప్రాయమైన పాలనా వ్యవస్థగా నిలిచి, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం అనే మూల విలువలను సంపూర్ణంగా సాకారం చేయగలదు.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.